SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 40 | సంచిక: 177 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 5 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## విద్యుత్ అక్రమాలపై సీబీఐ పంజా

- భూముల విలువల సవరణకు గ్రీన్ సిగ్నల్..
- బకాయిల క్లియరెన్స్‌కు ఓటీఎస్ స్కీమ్
- మొయినాబాద్‌లో 42 ఎకరాల్లో ఆధునిక మార్కెట్..
- రైతులకు పంట నష్టపరిహారంపై సీఎం ఆదేశం
- తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం!



**హైదరాబాద్, మే 4 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం, విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన భారీ అక్రమాలపై నిష్పాక్షిక దర్యాప్తు కోసం దీనిని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించాలని ప్రభుత్వం నిశ్చయించింది. సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ వివరాలను వెల్లడిస్తూ.. జస్టిస్ మదన్ బి. లోకూర్ కమిషన్ సమర్పించిన 114 పేజీల నివేదిక ఆధారంగా, అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉన్నందున సీబీఐ విచారణే సరైందని కేబినెట్ భావించినట్లు తెలిపారు.

మిగతా 2 లో

## కేరళలో యూడీఎఫ్ విజయంపై రేవంత్ అభినందనలు

- అసాధారణ విజయం సాధించిన కాంగ్రెస్ కూటమి
- జాతీయ నేతలకు ప్రత్యేక అభినందనలు
- ప్రజాస్వామ్య విలువలకు ప్రజల మద్దతు స్పష్టం



2



గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం

బీజేపీ విజయోత్సవంలో మోదీ

4

# బీజేపీ తీన్మార్!

## మూడు రాష్ట్రాల్లో ఎగిరిన కాషాయ జెండా

- బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో బీజేపీ హవా
- కేరళలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ దళం
- తమిళనాట దళపతి పార్టీ సంచలన విజయం
- బెంగాల్ లో కుప్పకూలిన అధికార పార్టీ
- కొలత్తూరులో ముఖ్యమంత్రి స్టాలిన్ ఓటమి
- అసోంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి
- పుదుచ్చేరి పీఠం మరోసారి పాత ప్రభుత్వానికే
- వామపక్షాలకు కేరళ ఓటర్ల తీవ్ర నిరాశ
- దేశ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు



దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు జాతీయ రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, మొత్తం ఐదు రాష్ట్రాలకు గానూ ఏకంగా మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ కూటమి ఘన విజయం సాధించి సత్తా చాటింది. పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కమలం వికసించి అధికార పీఠాలను దక్కించుకుంది. ఇక పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి జయకేతనం ఎగురవేసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ద్రావిడ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న తమిళనాడులో మాత్రం అనూహ్యంగా నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఏకపక్ష విజయం సాధించి రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది.

వివరాలు 4వ పేజీలో



## తమిళనాట 'విజయ' విప్లవం

స్టాలిన్ ఘోర పరాజయం..

సీఎం పీఠం దిశగా 'దళపతి'

4

## కేరళలో కాంగ్రెస్ జైత్రయాత్ర

యడ్పీఎఫ్ ఘనవిజయం

4

## పారిశ్రామిక విప్లవానికి బాటలు

- క్లస్టర్ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి కీలక సమీక్ష
- మూడు ఎకనమిక్ రీజియన్లపై సమగ్ర ప్రణాళిక
- భవ్య పథకం కింద భారీ పారిశ్రామిక పార్కుల ఏర్పాట్లు
- ఎంఎస్ఎంఈల బలోపేతంతో ఉపాధి అవకాశాల విస్తరణ




5



## రైతులపై కాంగ్రెస్ పగబట్టింది

- సదాశివపేటలో కేటీఆర్ నిప్పులు
- కొనుగోళ్లు లేక అన్నదాతల అవస్థలు
- మన్నె క్రిశాంక్ అరెస్టుపై ఆగ్రహం

.. వివరాలు 3లో

## వేరేవాళ్లు పెళ్లి చేసుకుంటే మనం డ్యాన్స్ చేయాలా?

- టీ బీజేపీ నేతలపై రాజాసింగ్ ఫైర్!



3

## వైద్యానికి వెళ్తుండగా..

- లారీని ఢీకొన్న అంబులెన్స్
- రోగి సహా నలుగురి దుర్మరణం
- శ్రీకాళహస్తి దగ్గర రోడ్డు ప్రమాదం



5

## ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం

- సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు
- బ్రేక్ డౌన్ అయినప్పుడు 14449కు కాల్ చేయండి
- వాహనదారులకు కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక

2




## రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

కేంద్రం తన మొండివైఖరి వీడాలి

తాండూరు రైతు వారోత్సవాల్లో మంత్రి తుమ్మల

2





# కేరళలో యూడీఎఫ్ విజయంపై రేవంత్ అభినందనలు

**అసాధారణ విజయం సాధించిన కాంగ్రెస్ కూటమి**

**జాతీయ నేతలకు ప్రత్యేక అభినందనలు**

**ప్రజాస్వామ్య విలువలకు ప్రజల మద్దతు స్పష్టం**

**హైదరాబాద్, మే 4 :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, కూటమి సాధించిన విజయం అసాధారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసి వేణుగోపాల్, దీపాదాస్ మున్షీల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాను కేరళలో ప్రచారంలో పాల్గొన్న సమయంలో అక్కడి ప్రజలు చూపిన ఆదరణను గుర్తు చేసుకున్న ఆయన, యూడీఎఫ్ మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి బలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు అభివృద్ధిని విశ్వసిస్తాయని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించడంతో కొత్త భవిష్యత్తుకు నాంది పలికారని అన్నారు. ఇదే విషయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఈ విజయం ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. యూడీఎఫ్‌కు కేరళ ప్రజలు ఇచ్చిన మద్దతు ఆనందదాయకమని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ కూడా స్పందిస్తూ ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన అందించాలనే సంకల్పానికి ఈ విజయం బలాన్నిచ్చిందని అభిప్రాయపడ్డారు.

# ముస్లింలకు రేవంత్ శుభవార్త

**హజ్ ఖర్చులను ప్రభుత్వం భరించేలా భరోసా**

**హైదరాబాద్, మే 4:** తెలంగాణ ప్రభుత్వం హజ్ యాత్రికులకు గుడ్ న్యూస్ తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో హజ్ యాత్ర ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ అదనపు భారాన్ని పేద ముస్లిం సోదరులపై పడకుండా, ఆ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'హజ్ యాత్రికులకు అదనంగా అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 7 వేల మంది హజ్ యాత్రికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ముస్లిం యాత్రికులకు ఈ నిర్ణయం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. ముస్లిం సోదరులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని హజ్ యాత్రికులు, మైనారిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# డంపింగ్ యార్డును తొలగించండి

**సీఎంను కోరిన ప్రజాప్రతినిధులు**

**హైదరాబాద్, మే 4:** జవహర్ నగర్ డంప్ యార్డును తరలించాలాలని సీఎం రేవంత్‌ను పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేసారు. ఇక్కడి చెత్తను తొలగించి చుట్టుపక్కల ప్రజలకు విముక్తి కలిగించాల న్నారు. డంప్ యార్డును తొలగిస్తామన్న వాగ్దానాన్ని వారు గుర్తు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యాంటీ జవహర్ నగర్ డంప్ యార్డ్ జెఏసి కలిసింది. సీఎంను కలిసిన వారిలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జెఏసి కన్వీనర్ శంకర్ నారాయణ్, ఇతర జెఏసి నాయకులు అన్నారు. సమస్య తీవ్రత తెలుసని, పరిష్కారం ఆలోచిస్తున్నామని సిఎం అన్నారు.

# సర్కార్‌కు హైకోర్టు 'బ్రేక్'

**పీఏసీఎస్ నామినేటెడ్ కమిటీల వ్యూహానికి చెక్!**

**జీవో నెం. 597పై స్టే విధిస్తూ సంచలన ఆదేశాలు..**

**పాత పాలకవర్గాలకే మళ్లీ ఛాన్స్**

**ఎన్నికలు పెట్టకుండా నామినేషన్లా?**

**రేవంత్ రెడ్డి నిర్ణయంపై న్యాయస్థానం సీరియస్**



**హైదరాబాద్, మే 4 :** ఆశించినది ఒకటి.. జరిగింది మరొకటి! సహకార రంగంపై పట్టు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసిన మాస్టర్ ప్లాన్ ఇప్పుడు న్యాయస్థానం గడప వద్ద నిలిచిపోయింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా, తమకు అనుకూలమైన వారితో నామినేటెడ్ కమిటీలను నింపాలని చూసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి షాక్ తగిలింది. ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులపై స్టే విధిస్తూ న్యాయమూర్తి సోమవారం కీలక తీర్పు వెలువరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీఏసీఎస్ పాలకవర్గాలు, డీసీసీబీ బోర్డులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీల తరహాలోనే ఇక్కడ కూడా ఎన్నికల ఊసే లేకుండా నామినేటెడ్ కమిటీలను నియమించాలని భావిస్తూ జీవో నెం. 597ను విడుదల చేసింది. అయితే, ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించడంతో ఈ వివాదం మలుపు తిరిగింది. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, సహకార సంఘాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ కమిటీలను ఎలా వేస్తారని ప్రశ్నించింది. ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధిస్తూనే.. మెమో నెం. 8719/2018/పీఏసీఎస్--వీ ప్రకారం తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల పాలక వర్గాలకే బాధ్యతలు అప్పగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అంటే, ప్రభుత్వం రద్దు చేసిన పాత కమిటీలే ఇప్పుడు మళ్లీ విధుల్లో కొనసాగే అవకాశం లభించింది. గత ప్రభుత్వం చేసిన తప్పులనే ప్రస్తుత ప్రభుత్వం కూడా చేస్తోందని ఈ సందర్భంగా విమర్శలు వస్తున్నాయి. నామినేటెడ్ కమిటీల ద్వారా సహకార సంఘాలను హస్తగతం చేసుకోవాలనుకున్న ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ స్టే ఆర్డర్ పెద్ద అడ్డంకిగా మారింది. కోర్టు ఆదేశాలతో ఒక్కసారిగా సీన్ మారిపోవడంతో, ఇప్పుడు ప్రభుత్వం తదుపరి అడుగులు ఎలా వేయబోతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# విద్యుత్ అక్రమాలపై సీబీఐ పంజా

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువలను శాస్త్రీయంగా సవరించేందుకు (రేషనలైజేషన్) రిజిస్ట్రేషన్ శాఖకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. ఈ నెల చివరి వారం నుంచి సవరించిన కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. దీనివల్ల ప్రాజెక్టుల నిర్వాసితులకు అందే పరిహారం పెరగనుంది. అలాగే 'హిల్ట్' పాలసీ కింద భూముల ధరలు పెరగకముందే దరఖాస్తు చేసుకున్న వారికి పాత ధరలకే భూములు పొందేందుకు పది శాతం ముందస్తు చెల్లింపు వెసులుబాటు కల్పించారు. అటు మున్సిపల్ శాఖలో పేరుకుపోయిన పన్ను బకాయిల కోసం 'వన్ టైమ్ సెటిల్‌మెంట్'(ఓటీఎస్) పథకానికి ఆమోదం తెలిపారు. దీనివల్ల వడ్డీలు, జరిమానాలు మినహాయించి దాదాపు రూ.1686 కోట్ల బకాయిలు వసూలవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఊతమిచ్చేలా మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం (నార్మాక్) నిర్వహణను నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించే ఎంవోయూకు ఆమోదం తెలిపారు. అలాగే రూ. 66.50 కోట్లతో 9 జిల్లాల్లోని సబ్ స్టేషన్ల వద్ద సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు, ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి పచ్చజెండా ఊపారు. రాష్ట్రంలోని ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' పరిధిలోకి తీసుకురావాలని, మొయినాబాద్ అజీజ్ నగర్‌లో 42 ఎకరాల్లో ఆధునిక మార్కెట్ నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఇన్ ఛార్జీ మంత్రులను ఆదేశించారు.

# రెండు కార్పొరేషన్లు, ఐదు పురాల్లో స్పెషలాఫీసర్ పాలన

**రేపటి నుంచి ముగియనున్న పాలక వర్గాల గడువు**

**హైదరాబాద్, మే 5:** రాష్ట్రంలోని గ్రేటర్ వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లతోపాటు మరో ఐదు మున్సిపాలిటీల్లో పాలకవర్గాల గడువు ఈనెల 6వ తేదిన ముగియనుంది. దీంతో పాలకవర్గం గడువు ముగిసిన వెంటనే స్పెషల్ ఆఫీసర్ విధించనున్నారు. ఇప్పటికే ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు కొలువుదీరిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలను మినహాయిస్తే 130 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, అచ్చంపేట, సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూరు, నకిరకల్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది.




**10 యూఎల్బీలకు ఒకేసారి..**

రాష్ట్రంలోని 10 పట్టణ స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఒకే సారి ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.. జీహెచ్ఎంసీతోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన సీఎంసీ, ఎంఎంసీ, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతోపాటు జడ్చర్ల, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట్ మున్సిపాలిటీలకు ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో ఇప్పటికే వార్డుల పునర్విభజన కూడా ఫైనల్ చేసిన విషయం విధితమే. జనగణన తర్వాత ఎంటీపీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముగిసిన తర్వాత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

# ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం

- సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు
- బ్రేక్ డౌన్ అయితే 14449కు కాల్ చేయండి
- వాహనదారులకు సజ్జన్నార్ హెచ్చరిక




హైదరాబాద్, మే 4: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచన చేశారు. ఇటీవల కాలంలో ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడం వల్ల జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పలు సూచనలు చేశారు. ఈ మేరకు సజ్జనార్ ఓ ప్రకటన విడుదల చేశారు. వాహనాల బ్రేక్ డౌన్, మెడికల్ ఎమర్జెన్సీ వంటి బలమైన కారణాలు ఉంటే తప్ప, సెల్ఫీలు దిగడానికి లేదా విశ్రాంతి తీసుకోవడానికి వాహనాలను రోడ్డు పక్కన నిలపడం చట్టరీత్యా నేరమని.. అత్యంత ప్రమాదకరమని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఒకవేళ మీ వాహనం ఆగిపోతే, తక్షణమే 14449 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. వీరు మీకు తగిన సహాయం అందించడమే కాకుండా, ఇతర వాహనదారులను అప్రమత్తం చేసే ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో వాహనాన్ని నిలపాల్సి వస్తే, వేగంగా వచ్చే ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఎడమ వైపు ఉన్న లైన్‌లో మాత్రమే నిలపాలని సీపీ సజ్జనార్ సూచించారు. వాహనం ఆపినప్పుడు, వెనుక నుంచి వచ్చే వారికి కనీసం 50 నుంచి 100 మీటర్ల దూరం నుంచే తెలిసేలా 'రిఫ్లెక్టివ్ ట్రయాంగిల్స్' లేదా ఇతర హెచ్చరిక గుర్తులను ఏర్పాటు చేయాలని తెలిపారు. వాహనం ఆపి ఉన్నంత సేపు హజార్డ్ లైట్లను (నాలుగు ఇండికేటర్లు) ఆన్ చేసి ఉంచడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని అన్నారు. క్షఖీఖీపై వాహనాల వేగ పరిమితి గంటకు 120 కిలోమీటర్ల వరకు పెంచిన నేపథ్యంలో, ఒక్క చిన్న పొరపాటు కూడా భారీ ప్రాణ నష్టానికి దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నిబంధనలను పాటించి మీ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది..

## కేంద్రం తన మొండివైఖరి వీడాలి

**తాండూరు రైతు వారోత్సవాల్లో మంత్రి తుమ్మల**

**తాండూరు, మే 4 :** "రైతు ప్రయత్నం చేయకపోతే భవిష్యత్తులో భూమి మొత్తం నిస్సారమవుతుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంటలు పండించేలా మన రైతులు అడుగులు వేయాలి. అన్నదాతల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం" అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. తాండూరులో నిర్వహించిన 'రైతు వారోత్సవాల' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, సాగు రంగంపై తన మనసులోని మాటను పంచుకుంటూనే, కేంద్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. "తెలంగాణ రైతు దేశానికే ఆదర్శం. అత్యధిక పంటలు పండించే సత్తా మనోళ్లకే ఉంది. రైతులను ఆర్థికంగా ఆదుకోవడానికి ఇప్పటికే మన ప్రభుత్వం రూ. 1.40 లక్షల కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. రైతుల కష్టాన్ని గుర్తించి, కోట్‌పల్లి ప్రాజెక్టు కోసం రూ. 90 కోట్లు మంజూరు చేయించాం. అయితే, రైతులు కేవలం రసాయన ఎరువులపైనే ఆధారపడకుండా ఆర్గానిక్ పంటల వైపు మళ్లాలి. మన నేల తల్లిని కాపాడుకుంటేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుంది" అని తుమ్మల పేర్కొన్నారు. ఇదే వేదికపై నుంచి కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల ఒక హెచ్చరిక లాంటి లేఖను పంపారు. "శనగ, పొద్దుతిరుగుడు పంటలపై కేంద్రం పెట్టిన 25 శాతం కొనుగోలు పరిమితిని వెంటనే ఎత్తివేయాలి. ఈ నిబంధనల వల్ల మన రైతులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. మొక్కజొన్న, జొన్న పంటలను కూడా కేంద్రమే మద్దతు ధర పథకంలో చేర్చి కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర రానప్పుడు ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. అందుకే ప్రస్తుత యాసంగిలో ఎంఎస్పీ వద్ద సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మేమే కొనుగోలు చేశాం" అని ఆయన వివరించారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కోరిక మేరకు తాండూరు కందికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తించిన మంత్రి, ఇక్కడ 'కంది బోర్డు' ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. జిల్లాకు ఆయిల్ ఫామ్ కంపెనీ మంజూరైందని, వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చడమే తమ లక్ష్యమని తుమ్మల ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులతో కలిసి స్టాల్స్‌ను సందర్శించిన మంత్రి, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రైతులకు సూచించారు.



# అకాల వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తం

**మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్, మే 4 :** అకాల వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధాన్యం కొనుగోళ్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.2001.96 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. రానున్న 3 నుంచి 4 రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశం ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఈదురుగాలులు, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున నల్గొండ, నిజామాబాద్ జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైనన్ని తార్పాలిన్లు (పాలీథిన్ కవర్లు) సిద్ధంగా ఉంచాలి. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేలా అధికారులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి' అని అన్నారు.

# రైతులపై కాంగ్రెస్ పగబట్టింది



- సదాశివపేటలో కేటీఆర్ నిప్పులు
- కొనుగోళ్లు లేక అన్నదాతల అవస్థలు..
- మన్నె క్రిశాంక్ అరెస్టుపై ఆగ్రహం

**సంగారెడ్డి, మే 4 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను చచ్చే వరకు వేధిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో శనగల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనగ పంట చేతికి వచ్చి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా పంటలు కొనుగోలు చేసేవారని, సమయానికి రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా, కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని విమర్శించారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని, ధాన్యాన్ని దళారుల పాలు చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని ఆయన ఆరోపించారు. వారం రోజుల్లోగా కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం పట్టించుకోకపోతే తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

### క్రిశాంక్ అరెస్టుపై ధ్వజం

అనంతరం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు వెళ్లిన కేటీఆర్, అక్కడ రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను పరామర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రశ్నించినందుకే క్రిశాంక్‌పై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై దృష్టి పెట్టని ముఖ్యమంత్రి, సోషల్ మీడియా పోస్టులపై కేసులు పెట్టడంలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లో పట్టపగలే కాల్పులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పోలీసు వ్యవస్థను ముఖ్యమంత్రి తన 'ప్రైవేట్ ఆర్మీ'లా వాడుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, జర్నలిస్టుల ఫోన్లను హ్యాక్ చేస్తున్నారని, ట్యాపింగ్ చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి క్రిశాంక్‌ను అరెస్టు చేయడంపై కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ వేస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు బీఆర్ఎస్ లీగల్ సెల్ అండగా ఉంటుందని, ప్రభుత్వ అరాచకాలపై పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# పాలమూరు నుంచే కవిత తొలి అడుగు!

- ఈ నెల 8న చౌదరిగూడెం వద్ద భారీ బహిరంగ సభ
- కృష్ణా జలాల్లో జరుగుతున్న అన్యాయంపై గళం
- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కోసం ఉద్యమం



**హైదరాబాద్, మే 4:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ స్థాపన తర్వాత అధినేత్రి కల్వకుంట్ల కవిత తన రాజకీయ ప్రయాణాన్ని పాలమూరు గడ్డ నుంచే ప్రారంభించనున్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తేందుకు ఆమె సిద్ధమయ్యారు. ఈ నెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధన కోసం శంఖారావం పూరించనున్నారు. 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం.. అదే రోజు సాయంత్రం పాలమూరు ఉ రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద బహిరంగ సభలో కవిత ప్రసంగిస్తారు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లు గడిచినా కృష్ణా జలాల వినియోగంలో రాష్ట్రం వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని ఆమె విమర్శించారు. కృష్ణా గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకునేలా తమ వద్ద స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు ఉ రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచినా పూర్తి కాకపోవడంపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు సత్వర అనుమతులు సాధించడంతో పాటు పనులు వేగవంతం చేసేలా ఉద్యమ ప్రణాళికను ప్రకటించనున్నారు. తెలంగాణకు హక్కుగా దక్కే ప్రతి చుక్క నీటిని సాగు భూములకు మళ్లించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సభకు సంబంధించి బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నవీన్ ఆచారి గొంగళ్ల రంజిత్ కుమార్ సయ్యద్ ఇస్మాయిల్ నరేశ్ ప్రజాపతి ఎదురుగట్ల సంపత్ గౌడ్ సీమ రమేశ్ బుచ్చిబాబు ముస్తఫా పాల్గొన్నారు.

# తెలంగాణలోనూ బీజేపీ విజయం ఖాయం!

### ఇండియా కూటమికి అసెంబ్లీ ఫలితాలు చెంపపెట్టు
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు



**హైదరాబాద్, మే 4 :** తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా కూటమికి బుద్ధి చెప్పారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. ఈ ఫలితాలను చూస్తుంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. 33 ఏళ్లు కమ్యూనిస్టులు 15 ఏళ్లు తృణమూల్ పాలించిన బెంగాల్ కోటలో బీజేపీ విజయం సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అస్సాంలో మూడోసారి బీజేపీ కూటమి అధికారంలోకి వస్తోందని రామచంద్రరావు తెలిపారు. కుటుంబ పాలన అవినీతి లేని పాలన అందించడం వల్లే అస్సాం ప్రజలు మళ్లీ పట్టం కట్టారని చెప్పారు. ఉత్తరాది దక్షిణాది మధ్య విద్వేషాలు సృష్టించిన ఇండియా కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కుకట్‌పల్లి నుంచి మైనారిటీలు పెద్ద ఎత్తున బీజేపీలో చేరారని రామచంద్రరావు వెల్లడించారు. ముస్లిం మహిళలు ప్రధాని మోదీని పెద్దన్నగా భావిస్తున్నారని చెప్పారు. మే 10న పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా సంక్షేమ పాలన అందించేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

# సీఎంను కలిసిన వీఈఎం సీఎండీ

**హైదరాబాద్, మే 4:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో వీ ఈ ఎం టెక్నాలజీస్ డిఫెన్స్ ఇండస్ట్రీ వ్యవస్థాపకుడు సీఎండీ వి వెంకట రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. జహీరాబాద్ నిమ్జ్ లో కొత్త యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం అందించిన సహకారానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ కాసు ప్రసాద రెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. ఆసుపత్రి 30వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ భేటీలో ఆసుపత్రి అందిస్తున్న సేవలను సీఎంకు వివరించారు.

### సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కిమ్స్ చైర్మన్!

ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని కిమ్స్ ఆసుపత్రుల గ్రూప్ చైర్మన్ బి భాస్కర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. కిమ్స్ ఆసుపత్రి నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రావాలని ముఖ్యమంత్రిని ఆయన ఆహ్వానించారు. నూతనంగా అందుబాటులోకి రానున్న ఆసుపత్రి బ్రాంచ్ ప్రారంభోత్సవానికి రావాలని భాస్కర్ రావు ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కల్పిస్తున్న వైద్య సదుపాయాల గురించి చర్చించారు.



# కేరళలో రేవంత్ ప్రచారం పనిచేసింది

### వ్యూహాత్మకంగా ప్రచార సరళి.. : కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్ గౌడ్



**హైదరాబాద్, మే 4:** కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. కేరళలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, నాయకులు ప్రచారం నిర్వహించడం.. తెలంగాణ పాలన చూసి ఓట్లు వేయాలని కోరడం చాలా ప్రభావం చూపించింద న్నారు. కేరళలో విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని.. మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించిందని వెల్లడించారు. తమిళనాడులో మెజారిటీ స్థానాలు గెలుచుకున్న టీవీకే అధినేత విజయ్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలపై ఇండియా కూటమి సమీక్ష చేసి.. మరింత బలోపేతం అయ్యేందుకు చర్యలు చేపడుతుందని తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ విజయం సాధించింది. ఈ విజయం వెనక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు ఉన్నాయని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. యూడీఎఫ్ విజయంలో సీఎం రేవంత్ రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కేరళ సీఎం విజయన్‌పై.. రేవంత్ రెడ్డి నేరుగా విమర్శలు ఎక్కుపెట్టారని గుర్తు చేశారు. కేరళ అభివృద్ధిపై విజయన్‌ను నిలదీయడం తోపాటు లేఖలు కూడా రాశారని పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేరళ ప్రచారంలో రేవంత్‌రెడ్డి వివరించారన్నారు. ఒక్క డైలాగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల దశను మార్చారని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కొనియాడారు. ఆయన బ్రాండ్ కేరళలో ఉపయోగపడిందన్నారు. విజయన్ టైం అయిపోయిందని రేవంత్ ముందే చెప్పారని గుర్తు చేశారు. కేరళ ఎన్నికల్లో ఆయన ప్రసంగాలు పార్టీ అభ్యర్థుల విజయాలకు దోహదపడ్డాయన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆ రాష్ట్ర ప్రజలను తన ప్రసంగాలతో ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేరళ ప్రజలకు వివరించారన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.

# రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ శ్రీలత



**హైదరాబాద్:** రాష్ట్రంలోఅవినీతి నిరోధక శాఖ అధికారులు వరుస దాడులు నిర్వహిస్తున్నప్పటికీ కొన్ని శాఖల్లో అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. డబ్బులిస్తేనే పనవుతుందని, ఫైళ్లు కదులుతాయని మధ్యవర్తులతో చెప్పిస్తున్నారు. అడిగినంత సమర్పించుకుంటేనే పని జరుగుతుందని వసూళ్ల దందా సాగిస్తున్నారు. తాజాగా బోరబండలో లంచం తీసుకుంటూ ఓ అధికారిణి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. రోజుల వ్యవధిలోనే పలువురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం కలకలం రేపుతోంది. బోరబండ జీహెచ్ఎంసీ ఆఫీసులో ఏసీబీ తనిఖీలు నిర్వహించింది. జూనియర్ అసిస్టెంట్ శ్రీలత రూ.లక్ష లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి. హౌస్ కన్స్ట్రక్షన్ కోసం ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేసిందని, సోమవారం ఓ సూపర్ మార్కెట్ వద్ద జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నామని అధికారులు వివరించారు.



# బెంగాల్ గెలుపుతో విపక్షాల్లో వణుకు

### తెలంగాణలోనూ బీజేపీ గెలుపు తథ్యం
### అత్యతంత ప్రతిష్టాత్మకంగా 10న ప్రధాని సభ
### ఎంపీ ధర్మపురి అర్వింద్ వెల్లడి

**హనుమకొండ, మే 4 :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హనుమకొండలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. లక్ష మందితో ఈ భారీ సభ అత్యంత ప్రతిష్మాత్మకంగా జరగనుందన్నారు. తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ అమలు చేయాల్సిన అవసరం ఉ ందని తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. 'వచ్చే రెండు రోజులు కేసీఆర్‌కు టీవీని దూరంగా ఉంచండి, లేదంటే ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. కొందరికి పార్టీలు పెట్టడం, డబ్బులు వసూలు చేయడం బిజినెస్‌గా మారిందని, కేసీఆర్‌తో ఎలాంటి పొత్తులూ ఉండన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండేళ్లు నాన్చి సీబీఐకి అప్పగించారు. సీబీఐ తన పని తాను చేసుకుపోతుంది. తెలంగాణలో ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు. ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనుల గురించి ఏం మాట్లాడతాం. సన్నబియ్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ అంటున్నారు.. వాస్తవానికి ఆ బియ్యం ఇస్తుంది నరేంద్ర మోదీనే. కేసీఆర్ పెట్టిన పంగనామాలను రేవంత్ రెడ్డి కంటిన్యూ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని అన్నారు.

# వేరేవాళ్లు పెళ్లి చేసుకుంటే మనం డ్యాన్స్ చేయాలా?

### బెంగాల్, అస్సాం విజయాలపై ఇక్కడ సంబరాలేంటి?
### మన నేతలకు 'ఇగో' ఎక్కువ.. అందుకే రాష్ట్రంలో గెలవలేకపోతున్నాం
### టీ బీజేపీ నేతలపై రాజాసింగ్ ఫైర్!
### సొంత పార్టీ నేతలపై ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 5:** తెలంగాణ బీజేపీ నేతల పనితీరుపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి నిప్పులు చెరిగారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ సాధిస్తున్న విజయాలను చూసి ఇక్కడ సంబరాలు చేసుకోవడమే తప్ప, సొంత రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే తపన నాయకుల్లో లోపించిందని ఆయన ధ్వజమెత్తారు. ఈ మేరకు విడుదల చేసిన ఒక వీడియోలో రాష్ట్ర నేతల అహంకారంపై రాజాసింగ్ విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడంపై తెలంగాణ నేతలు సంబరాలు చేసుకోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇంకా ఎన్నేళ్లు వేరేవాళ్లు పెళ్లి చేసుకుంటే మనం ఇక్కడ డ్యాన్స్ చేయాలని, మన రాష్ట్రంలో ఎప్పుడు అధికారంలోకి వస్తామో చెప్పాలని ఘాటుగా ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ ఎదుగుదలకు కొంతమంది నేతల వ్యక్తిగత అహంకారమే అడ్డుగా మారిందని, నేతల మధ్య మనస్పర్ధల వల్లే పార్టీ నష్టపోతోందని ఆరోపించారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకుని ఇతర రాష్ట్రాల నేతలను చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న ఎన్. రాంచందర్ రావుకు పూర్తి స్వేచ్ఛనిస్తేనే రాష్ట్రంలో అధికారం సాధ్యమని రాజాసింగ్ అభిప్రాయపడ్డారు. కొందరు నేతలు తమ ఈగోలను పక్కన పెట్టి పని చేస్తేనే తెలంగాణలో కమలం జెండా ఎగురుతుందని స్పష్టం చేశారు. గతంలో పార్టీ నుంచి బహిష్కరణకు గురైనప్పటికీ, రాజాసింగ్ ఎప్పుడూ అధిష్టానంపై కాకుండా స్థానిక నాయకత్వ లోపాలనే ఎత్తి చూపుతున్నారు. రాష్ట్రంలో పార్టీని గెలిపించే సత్తా ఉన్నా, నేతల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే వెనుకబడిపోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.

# దేశమంతా డబుల్ ఇంజన్ ఖాయం

### కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య



**కరీంనగర్, మే 4:** దేశమంతా ఇక డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. పశ్చిమబెంగాల్‌లో ఎన్నో అరాచకాలు జరిగాయని.. బంగ్లా చొరబాటు దారులకు దారులు మూసుకుపోయాయని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. దేశం అంతా బీజేపీని కోరుకుంటోందని ఉద్ఘాటించారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కలలు కంటున్నారని అన్నారు. సీఎం ఎక్కడికి వెళ్తే.. అక్కడ కాంగ్రెస్‌కు ఓటమినేనని ఎద్దేవా చేశారు. కేరళంలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండటంతోనే.. ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు కొంత అనుకూలంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ రావాలని ప్రజలు కోరుకున్నారని అన్నారు. బీజేపీకి అసలు ప్రచారకర్త రాహుల్ గాంధీనేనని బండి సంజయ్ సెటైర్లు గుప్పించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేసేందుకు ప్రయత్నించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని బండి సంజయ్ అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లోనూ మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ దుకాణంలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. ఈ ఘటనను రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు. దుకాణం యాజమాన్యంతో మాట్లాడానని, బాధితులకు అండగా నిలవాలని కోరానని అన్నారు.



సంపాదకీయం

# బీజేపీకి మరింత శక్తి!

బెంగాల్, తమిళనాడు, కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు ఎక్కువగా బీజేపీకే లాభించింది. ముఖ్యంగా బెంగాల్, తమిళనాట పాలకుల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. కేవలం కుటుంబ పాలనతో ప్రజలను విస్మరించిన మమత, స్టాలిన్‌లకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు. బీజేపీకి కొత్త శక్తిని ఇచ్చారు. దేశమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూసినా..అందరి దృష్టి కేవలం బెంగాల్‌పైనే ఉంది. బెంగాల్లో మమతా బెనర్జీని బీజేపీ మట్టికరిపిస్తుందా లేదా అని ఎదురు చూశారు. అనుకున్నట్లుగానే, మోడీ, అమిత్ షా ద్వయం బెంగాల్లో కూడా పాగా వేశారు. అస్సాంలో పట్టు నిల్పుకున్నారు. కలకత్తా కాళీ కరుణించింది. బీజేపీకి పగ్గాలు అప్పగించిది. ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ అక్కడా మార్పు కోసం యత్నించ నుంది. దేశంలో నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలు మార్పును సూచించాయి. ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. బీజేపీ, కాంగ్రెస్ ఖాతాలో మరో రాష్ట్రం పడగా, తమిళనాడులో టివికె పార్టీ తొలి ప్రయత్నంలోనే అధికారం దక్కించుకోబోతోంది. ఇక్కడ డిఎంకె మళ్లీ విజయం సాధిస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. కేరళంలో దశాబ్దం తరవాత కాంగ్రెస్ కూటమి అధికారం లోకి రాబోతోంది. ఇక అసోం, పాండిచ్చేరిలో బీజేపీ అధికారం నిలుపుకుంది. మొత్తంగా బెంగాల్లో మమత, తమిళనాట స్టాలిన్‌ల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. ఇది వారి స్వయంకృత ఓటమిగానే చూడాలి. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళం విజయం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం. తమిళనాట పార్టీ పెట్టిన రెండేళ్లలోనే అధికారం చేపట్టబోతున్న విజయ్ ఓ రకంగా చరిత్ర సృష్టించారనే చెప్పాలి. నిరంకుశంగా పాలించడంతో పాటు కేవలం దక్షిణాది, హిందీ వ్యతిరకత ప్రదర్శించిన డిఎంకెకు ప్రజలు గుపాఠం చెప్పారు. బెంగాల్లో మమతా బెనర్జీ ఏకపక్ష రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్లో అవినీతి, అధికార దురహంకారం పెచ్చుమీరాయి. 15 ఏళ్లపాటు రాజ్యమేలిన బెంగాల్లో మమతా బెనర్జీ రాష్ట్రాన్ని మాఫియా కోటగా తయారు చేసుకున్నారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఓట్ల కోసం అక్ర చొరబాటుదారులను చేరదీశారు. వారికి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు మంజూరయ్యాయి. బంగ్లా వసలదారుల పెత్తనంలో సొంత రాష్ట్రం ప్రజలు నలిగి పోయారు. పరాయి ప్రజలుగా మారారు. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు నిత్యకృత్యం అయ్యాయి. ఇవన్నీ ఎదరించిన వారిని మట్టు పెట్టారు. దాడులు, విధ్వంస రచన సాగింది. అందుకే వీటిలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. వరుసగా నాలుగోసారి మమతా బెనర్జీ అధికారాన్ని అందుకుంటారా? లేకుంటే మమత పాలనకు బీజేపీ చరమ గీతం పాడనుందా? అంటూ ఈ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దాదాపు 50 ఏళ్ల పాటు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని రెండు పార్టీలే పాలించాయి. 34 సంవత్సరాలు జ్యోతిబసు నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని ఏలాయి. కానీ ఈ సారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేయడంతో అక్కడ కొత్త చరిత్ర లిఖితం కాబోతోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నడించింది. ఆ సమయంలో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దాదాపుగా ఐదేళ్లుగా అక్కడ బీజేపీ వివిధ సమస్యలపై పోరాడుతూ వచ్చింది. అందుకు ఫలితం దక్కింది. బెంగాల్లో బీజేపీ కాషాయ జెండా ఎగరేయడం ఓ చరిత్రగా చూడాలి. ఇకపోతే ఈ విజయం ఓ రకంగా మోడీ, అమిత్ షాల పట్టుదల, వ్యూహాత్మక రాజకీయాలకు నిదర్శనంగా చూడాలి. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ ప్రజలు ఛీకొట్టారు. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అనిచాటుకుంది. ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇక విజయోత్సవాల్లో పాల్గొనడానికి వస్తామని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. కానీ ఓటర్లు బీజేపీకే పట్టం కట్టారు. ఇక కేరళ విషయానికి వస్తే ఎన్నికల అయిపోగానే ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించు కున్నారు.. వృద్ధాప్యంతో పాటు పలు అవినీతి, కుంభకోణాల కారణంగా అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ లేదా యూడిఎఫ్ అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత పదేళ్లుగా సినరయ్ విజయ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో యూడిఎఫ్‌కు మళ్లీ అధికారం దక్కడం ఖాయమయ్యింది. ఇక తమిళనాడు లో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరిని రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. అనూహ్యంగా ఆయనే కింగ్ అయ్యారు. అయితే పూర్తి మెజార్టీకి దూరంలో ఉన్నారు. దీంతో ఇతర పార్టీలతో జట్టుకట్టక తప్పనిపరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో అన్న డిఎంకె కూడా రెండోస్థానంతో సత్తా చాటింది. ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి'తమిళ వెట్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మె జారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. విజయ్ పార్టీ గెలవడంతో ఇప్పుడు తమిళనాడు లో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే. మొత్తంగా ఫలితాలు బీజేపీలో ఆశావహ దృక్పథాన్ని నిలిపాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కొంత తోడ్పడిందనే చెప్పాలి.



# బీజేపీ తీన్మార్!

- మూడు రాష్ట్రాల్లో ఎగిరిన కాషాయ జెండా
- బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో బీజేపీ హవా
- కేరళలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ దళం
- తమిళనాట దళపతి పార్టీ సంచలన విజయం
- బెంగాల్ లో కుప్పకూలిన అధికార పార్టీ
- కొలత్తూరులో ముఖ్యమంత్రి స్టాలిన్ ఓటమి
- అసోంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి
- పుదుచ్చేరి పీఠం మరోసారి పాత ప్రభుత్వానికే
- వామపక్షాలకు కేరళ ఓటర్ల తీవ్ర నిరాశ
- దేశ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. మొత్తం ఐదు రాష్ట్రాలకు గానూ ఏకంగా మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ కూటమి ఘన విజయం సాధించి సత్తా చాటింది. పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కమలం వికసించి అధికార పీఠాలు దక్కించుకుంది. ఇక పదేళ్ల తర్వాత కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి జయకేతనం ఎగురవేసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ద్రావిడ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న తమిళనాడులో మాత్రం అనూహ్యంగా కొత్త పార్టీ టీవీకే ఏకపక్ష విజయం సాధించి అందరినీ విస్మయానికి గురిచేసింది.

### బెంగాల్ లో కమల వికాసం..

పశ్చిమ బెంగాల్ శాసనసభలో మొత్తం 294 స్థానాలున్నాయి. ఇక్కడ అధికారంలోకి రావడానికి 148 స్థానాల మ్యాజిక్ ఫిగర్ అవసరం. దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్న టీఎంసీకి ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. భారీ ఆధిక్యంతో బీజేపీ మ్యాజిక్ ఫిగర్ ను సునాయాసంగా దాటేసి అధికార పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని అధికార పార్టీ ఏమాత్రం ప్రభావం చూపలేక చతికిలపడింది. తాజా ట్రెండ్స్ ప్రకారం బీజేపీ 160 కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతుండగా.. ప్రధాన ప్రతిపక్షానికే పరిమితం కాబోతున్న టీఎంసీ 100 లోపు స్థానాలతో సరిపెట్టుకునేలా కనిపిస్తోంది. వామపక్షాలు, కాంగ్రెస్ కూటమి సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యే ప్రమాదం నెలకొంది.

### తమిళనాట టీవీకే సంచలనం..

తమిళనాడు శాసనసభలో మొత్తం 234 స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 118 స్థానాలు సాధించాలి. ద్రావిడ రాజకీయాలకు కేంద్ర బిందువైన ఇక్కడ పూర్తిగా ఊహించని ఫలితాలు వస్తున్నాయి. దళపతి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఘన విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించబోతోంది. ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్ ను దాటేసిన ఆ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. అధికార డీఎంకే తీవ్ర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఏకంగా ముఖ్యమంత్రి స్టాలిన్ కొలత్తూరు నియోజకవర్గంలో వెనుకంజలో ఉండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రతిపక్ష హోదా కోసం ఏఐఏడీఎంకే, డీఎంకే మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ రెండు పార్టీలు చెరో 50 స్థానాల దరిదాపుల్లోనే ఆగిపోయే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

### కేరళలో కాంగ్రెస్ దళం..

కేరళ శాసనసభలో మొత్తం 140 స్థానాలున్నాయి. ఇక్కడ అధికార పీఠం దక్కించుకోవాలంటే 71 స్థానాల్లో గెలవాలి. పదేళ్లుగా వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కే పట్టం కడుతున్న ఓటర్లు.. ఈసారి అనూహ్యంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ వైపు మొగ్గుచూపారు. తాజా కౌంటింగ్ సరళి ప్రకారం యూడీఎఫ్ స్పష్టంగా మ్యాజిక్ ఫిగర్ ను దాటేసింది. 80 కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ బలమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. పదేళ్ల అధికార వ్యతిరేకతతో ఎల్డీఎఫ్ కూటమి తీవ్రంగా నష్టపోయి కేవలం 50 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదాలో కూర్చోబోతోంది. ఇక్కడ బీజేపీ కూటమి కూడా ఖాతా తెరిచి కొన్ని స్థానాల్లో సత్తా చాటుతుండటం విశేషం.

### అసోంలో హ్యాట్రిక్ కొట్టిన కాషాయం..

ఈశాన్య రాష్ట్రం అసోం శాసనసభలో మొత్తం 126 స్థానాలున్నాయి. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 64. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మరోసారి తన ప్రభంజనం సృష్టించింది. వరుసగా మూడోసారి అధికార పీఠాన్ని దక్కించుకుని అరుదైన హ్యాట్రిక్ సాధించింది. ఉదయం నుంచే స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తున్న ఎన్డీఏ కూటమి సులభంగా మ్యాజిక్ ఫిగర్ ను చేరుకుంది. మొత్తం 80 కి పైగా స్థానాల్లో ముందంజలో ఉండి విపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూటమి ఆశించిన స్థాయిలో రాణించలేక కేవలం 35 నుంచి 40 స్థానాలకే పరిమితం కాబోతోంది. స్థానిక ప్రాంతీయ పార్టీలు కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి.



### పుదుచ్చేరిలో మళ్లీ వారే..

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి శాసనసభలో 30 స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 16 స్థానాల బలం కావాలి. ఇక్కడ ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి తన ఆధిపత్యాన్ని పూర్తిస్థాయిలో నిలబెట్టుకుంది. బీజేపీ మద్దతుతో మ్యాజిక్ ఫిగర్ కు కావాల్సిన స్పష్టమైన మెజార్టీని సాధించి మళ్లీ సునాయాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. తాజా ట్రెండ్స్ ప్రకారం ఎన్డీఏ కూటమి 20 కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో దూసుకుపోతోంది. కాంగ్రెస్, డీఎంకే కూటమి ఓటర్లను ఆకర్షించడంలో విఫలమై కేవలం 6 నుంచి 8 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదా దక్కించుకోబోతోంది. స్వతంత్ర అభ్యర్థులు మిగిలిన ఒకటీ రెండు స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.

# తమిళనాట 'విజయ' విప్లవం

### స్టాలిన్ ఘోర పరాజయం..

### ముఖ్యమంత్రి పీఠం దిశగా 'దళపతి'

**చెన్నై, మే 4:** తమిళనాడు రాజకీయ యవనికపై ఐదు దశాబ్దాలుగా సాగుతున్న ద్రవిడ పార్టీల ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరపడింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం ఊహాతీతమైన మెజారిటీతో దూసుకువచ్చి కొత్త చరిత్రను లిఖించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను పూర్తిగా తలకిందులు చేస్తూ, అధికార డీఎంకేను కోలుకోలేని దెబ్బతీసిన టీవీకే.. రాష్ట్రంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించే దిశగా సాగుతోంది. ముఖ్యంగా చెన్నై, చంగల్‌పట్టు, కాంచీపురం వంటి ద్రవిడ పార్టీల కంచుకోటల్లో విజయ్ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. సినిమా గ్లామర్‌ను విజయవంతంగా ఓట్లుగా మలచుకున్న విజయ్, దివంగత నేతలు ఎన్టీఆర్, ఎంజీఆర్, జయలలిత వంటి దిగ్గజాల సరసన నిలిచారు. 1977 తర్వాత డీఎంకే, అన్నాడీఎంకే కాకుండా ఒక మూడో పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయడం ఇదే తొలిసారి కావడంతో యావత్ దేశం దృష్టి తమిళనాడుపై పడింది. ఈ ఎన్నికల ఫలితాల్లో అత్యంత సంచలనం ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఓటమి. తన సొంత నియోజకవర్గమైన కొళత్తూర్ నుంచి పోటీ చేసిన ఆయన, టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో సుమారు 9 వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. 1996 తర్వాత స్టాలిన్ ఎన్నికల బరిలో ఓడిపోవడం ఇదే మొదటిసారి. ఆయనతో పాటు రాష్ట్ర కేబినెట్‌లోని అత్యధిక మంది మంత్రులు ఓటమి బాటలో పయనించగా, స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మరోవైపు బీజేపీ నేతలు ఈ ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ సైతం వరుసగా రెండోసారి ఓటమి అంచున నిలిచారు. పీఎంకే,



కాంగ్రెస్‌లోని ఒక వర్గం కూడా టీవీకే పట్ల సానుకూలంగా ఉండటంతో, మరికొన్ని స్థానాల మద్దతుతో విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అవినీతి, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన ఈ తీర్పుతో చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం సంబరాలతో హోరెత్తిపోతోంది.

# చారిత్రక ఎన్నికలు

- బెంగాల్ విజయం శ్యాంప్రసాద్ ముఖర్జీకి అంకితం..
- గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం
- అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఈ ఎన్నికల విశేషం
- తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అండగా ఉంటా
- బీజేపీ కార్యాలయంలో జరిగిన విజయోత్సవంలో మోడీ



**న్యూఢిల్లీ, మే 4:** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి సంప్రదాయ బెంగాలీ పంచెకట్టులో విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కార్యకర్తల జయజయధ్వానాల మధ్య ఉద్వేగభరితంగా ప్రసంగించారు. నేడు భాజపా చరిత్ర సృష్టించిందని, ఈ విజయం కేవలం పార్టీది మాత్రమే కాదని, భారత రాజ్యాంగాన్ని మరియు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన ప్రజల విజయం అని ఆయన కొనియాడారు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో సాధించిన చారిత్రాత్మక విజయంపై స్పందిస్తూ, ఈ గెలుపు రాష్ట్ర ముద్దుబిడ్డ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతిని, ఉపశమనాన్ని కలిగిస్తుందని మోదీ భావోద్వేగంతో పలికారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన కన్న కలలు నేడు వాస్తవరూపం దాల్చుతున్నాయని, ఇకపై బెంగాల్ మట్టిలో భయాందోళనలకు చోటు ఉండదని, సుపరిపాలన మాత్రమే రాజ్యమేలుతుందని స్పష్టం చేశారు. గంగానది ప్రవహించే గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ప్రతిచోటా కమలం వికసించిందని, గంగా మరియు బ్రహ్మపుత్ర నదుల ఆశీర్వాదం వల్లే అస్సాంలో హ్యాట్రిక్ విజయం, బెంగాల్‌లో అఖండ మెజారిటీ సాధ్యమయ్యాయని ఆయన విశ్లేషించారు. భాజపా అంటేనే అభివృద్ధి మరియు సంక్షేమం అని ప్రజలు గుర్తించారని, తమ రాష్ట్రాల అభివృద్ధి కోసం ప్రజలే స్వయంగా భాజపాను కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల ఫలితాలపై స్పందిస్తూ.. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్‌కు ప్రధాని అభినందనలు తెలియజేశారు. కేరళ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'వికసిత కేరళం' కోసం కేంద్రం పూర్తి మద్దతు అందిస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే తమిళనాడులో మంచి ఫలితాలు సాధించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీని అభినందిస్తూ, తమిళనాడు ప్రగతి కోసం తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. పుదుచ్చేరిలో సుపరిపాలనకు పట్టం కట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తన మనసులోని మాటను 'ఎక్స్' వేదికగా పంచుకుంటూ, బెంగాల్ విజయం పార్టీకి చెందిన కొన్ని తరాల కార్యకర్తలు క్లిష్ట పరిస్థితుల్లో చిందించిన రక్తం, చేసిన కఠోర శ్రమకు దక్కిన ఫలితమని మోదీ కొనియాడారు. ప్రతి ఒక్క కార్యకర్తకు తాను సెల్యూట్ చేస్తున్నానని, రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ గౌరవం మరియు సమాన అవకాశాలు దక్కేలా భాజపా పాలన అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ విజయోత్సవ సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

సమయం



# నక్ష ఆస్తుల రక్ష

- ఆస్తులకు గ్యారెంటీ
- పట్టణ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు
- నక్ష ప్రాజెక్టుకు మళ్లీ వేగం
- ప్రతి కుటుంబ ఆస్తి వివరాల నమోదు లక్ష్యం
- డ్రోన్, జీఐఎస్ సాంకేతికతతో సర్వే
- తొమ్మిది నగరాల్లో అమలు ప్రారంభం
- 2027 మార్చి నాటికి పూర్తి లక్ష్యం
- రుణాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలకు సులభతరం



**అమరావతి, మే 4 :** పట్టణాల్లో నివసించే ప్రజల ఆస్తులకు భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాపర్టీ కార్డుల జారీకి సిద్ధమైంది. ఇందుకోసం నిలిచిపోయిన 'నక్ష' సర్వే ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు, స్థలాలు సహా అన్ని ఆస్తుల వివరాలను సేకరించి డిజిటల్ రూపంలో నమోదు చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. డ్రోన్ సాంకేతికత, భౌగోళిక సమాచార వ్యవస్థలను వినియోగించి ఖచ్చితమైన సర్వే చేపట్టనుంది. రాష్ట్రంలోని కాకినాడ, ఏలూరు, గుంటూరు, మంగళగిరి–తాడేపల్లి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కుప్పం, అనంతపురం నగరాల్లో ఈ సర్వే అమలు కానుంది. గతంలో ప్రారంభమైన పనులు పూర్తికాకపోవడంతో, ఇప్పుడు వాటిని వేగంగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ప్రతి ఆస్తికి ప్రత్యేక ప్రాపర్టీ కార్డు జారీ చేస్తారు. క్యూఆర్ కోడ్ ద్వారా యజమాని వివరాలు, విస్తీర్ణం, హద్దులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో రిజిస్ట్రేషన్, మార్పిడి ప్రక్రియలు వేగవంతం అవుతాయి. ఈ కార్డులు బ్యాంకు రుణాలకు ఆధారంగా ఉపయోగపడటంతో పాటు మున్సిపల్ ప్రణాళికలకు సహాయపడతాయి. సర్వే పునఃప్రారంభంపై త్వరలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది.

## నెల్లూరు ఇఫ్కోసెజ్‌లో మహానాడు

### మంత్రి నారాయణ వెల్లడి

**నెల్లూరు, మే 4 :** తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వహించే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ వెల్లడించారు. మహానాడును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహానాడును ఇఫ్కోసెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీన పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసుకుంటామని.. ప్రజలకు పలు హామీలు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మహానాడుకు రానున్నారని చెప్పుకొచ్చారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి నారాయణ మరోసారి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) ఉదయం నెల్లూరు జిల్లాలోని దస్తగిరి నగర్‌లో రూ.1.43 కోట్లతో చేపట్టబోయే సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంపై గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపి వెళ్లిందని... పరిశ్రమలు వెళ్లిపోయాయని.. రియల్ ఎస్టేట్ పడిపోయిందని విమర్శించారు. అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సీఎం చంద్రబాబు అనుభవంతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని తెలిపారు. యువనేత లోకేశ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఈ ఏడాది దేశంలో వచ్చిన పరిశ్రమల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని తెలిపారు. పరిశ్రమలు వస్తే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని చెప్పుకొచ్చారు. 'మహానాడు ఎక్కడ పెట్టాలో చెప్పటానికి వైసీపీ నేతలు ఎవరు? మా పార్టీ అధినేత నిర్ణయిస్తారు' అని అన్నారు. వైసీపీ తీరు మార్చుకోకపోతే ఆ పదకొండు సీట్లు కూడా ఈసారి రావని.. జనం గుండు సున్నా పెడతారంటూ మంత్రి నారాయణ హెచ్చరించారు.

## మంతెన సత్యనారాయణ రాజు, నారా లోకేశ్ భేటీ

### ఉండవల్లిలో మంత్రి నివాసంలో సమావేశం



**అమరావతి, మే 4 :** ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణుడు మంతెన సత్యనారాయణ రాజు సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ను కలిశారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంతెన సత్యనారాయణ రాజును యోగా, నేచురోపతి విభాగం గౌరవ సలహాదారుగా నియమించింది. ఆయనకు కేబినెట్ హోదా కూడా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ప్రకృతి వైద్య రంగంలో మంతెన దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. ప్రజారోగ్యానికి ఆయన చేస్తున్న కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. సహజ చికిత్సా విధానాల ప్రాముఖ్యతపై కూడా ఇరువురు చర్చించినట్లు తెలిసింది. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో ప్రకృతి వైద్యానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు పేర్కొన్నారు. మంతెన సత్యనారాయణ రాజు సూచనలు రాష్ట్ర ఆరోగ్య విధానాలకు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ఈ భేటీతో యోగా, నేచురోపతి రంగాల్లో మరింత అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు ఆరోగ్యకర జీవనశైలిపై మార్గదర్శనం అందించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలుస్తోంది.

# ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక విప్లవానికి బాటలు

- క్లస్టర్ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి కీలక సమీక్ష
- మూడు ఎకనమిక్ రీజియన్లపై సమగ్ర ప్రణాళిక
- భవ్య పథకం కింద భారీ పార్కుల ఏర్పాట్లు
- ఎంఎస్ఎంఈల బలోపేతంతో ఉపాధి అవకాశాల విస్తరణ




**అమరావతి, మే 4):** రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముందంజలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణ యాల దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో విశాఖ, అమరావతి, తిరుపతి ఎకన మిక్ రీజియన్ల అభివృద్ధిపై సమగ్ర చర్చ జరిగింది. ఈ మూడు ప్రాంతాలను పరిశ్రమల కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ సమీక్షలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య పథకం) కింద రాష్ట్రంలో పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపై వివరణాత్మక చర్చ జరిగింది. ఈ పథకం ద్వారా ఆధునిక సదుపాయాలతో కూడిన పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబ డులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ పార్కులు ఏర్పడితే ఉత్పత్తి రంగానికి కొత్త ఊపిరి లభిస్తుందని భావిస్తున్నారు. 2026–27 నా టికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ తయారీ క్లస్టర్లు రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా మారనున్నాయి. ముఖ్యంగా రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో పెట్టుబడులు పెరగడం ద్వారా అధునాతన పరిశ్రమలు రాష్ట్రంలో స్థిరపడే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేయడం ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెద్ద ఊతం లభించనుంది. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పారిశ్రామికీకరణ వేగవంతమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఎంఎస్ఎంఈల ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ సమావేశంలో మంత్రి టి జీ భరత్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్తో పాటు పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రతి విభాగం తమ తమ కార్యాచరణ ప్రణాళికలను వివరించి, అమలు దశలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది. ఈ చర్యలు అమలులోకి వస్తే ఆంధ్రప్రదేశ్ దేశంలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా అవతరించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## వైద్యానికి వెళ్తుండగా..


### లారీని ఢీకొన్న అంబులెన్స్.. రోగి సహా నలుగురి దుర్మరణం



**శ్రీకాళహస్తి, మే 4:** తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు కాగా.. వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోల్‌కతా నుంచి ఓ రోగిని చికిత్స నిమిత్తం బెంగళూరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. ఓరందూరు వద్ద హైవే పక్కన నిలిపి ఉన్న లారీని వెనకనుంచి ఢీ కొట్టింది. అంబులెన్స్‌లో డ్రైవర్‌తో సహా ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాయుడుపేట – రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద ఆగి ఉన్న లారీని అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఒక రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై అప్పటికే నిలిపి ఉంచిన లారీని అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా ఉన్న మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని ప్రాథమిక సమాచారం. వీరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శ్రీకాళహస్తి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు.

## మోడీ నాయకత్వానికి ప్రజల మద్దతు

### ఎన్నికల ఫలతాలపై చంద్రబాబు నాయుడు




**అమరావతి, మే 4:** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో కొనసా గుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రదర్శన స్పష్టంగా కనిపి స్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల్లో మోదీపై విశ్వాసం తగ్గలేదని, మరింతగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి దిశగా కేంద్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు ఇస్తున్నా రని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత భారత్' లక్ష్యానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ దిశగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా అమలవుతోందని సీఎం కొనియాడారు. అభివృద్ధి ఫలాలు ప్రతివర్గానికీ అందేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత ఐక్యంగా, బలంగా మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, 'వికసిత భారత్' దార్శనికతకు ఇది బలమైన మద్దతని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'సబ్ కా సాథ్' స్ఫూర్తితో దూసుకెళ్తున్న ఎన్డీఏ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మరింత బలోపేతం అవుతుందని ఉద్ఘాటించారు.

## స్వదేశానికి షహనాజ్

### ఒమాన్‌లో చిక్కుకున్న తెలుగు మహిళకు విముక్తి

### ఏపీ ప్రభుత్వం, ఏపీఎన్ఆర్టీ కృషితో 7న ఇంటికి చేరనున్న బాధితురాలు



**అమరావతి, మే 4:** ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి ఏజెంట్ల చేతిలో మోసపోయి, ఒమాన్ దేశంలోని మస్కట్‌లో చిక్కుకుపోయిన అన్నమయ్య జిల్లాకు చెందిన దూదేకుల షహ్నాజ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలిచింది. గతేడాది నవంబర్‌లో విదేశీ ఉద్యోగం కోసం వెళ్లిన ఆమెను అక్కడి ఏజెంట్లు నిర్బంధించడమే కాకుండా, తిరిగి భారత్‌కు రావాలంటే రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకోవడంతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో షహ్నాజ్ భర్త అబూబకర్ ఏపీఎన్ఆర్టీ సొసైటీని ఆశ్రయించి తన భార్యను కాపాడాలని విన్నవించారు. ఈ ఉదంతంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఏపీఎన్ఆర్టీ సొసైటీ అధికారులు మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపారు. స్థానిక పోలీసుల జోక్యంతో ఏజెంట్లతో చర్చలు జరిపి, షహ్నాజ్‌ను ఎటువంటి అదనపు చెల్లింపులు లేకుండా స్వదేశానికి పంపేలా ఒప్పించారు. ప్రయాణ ఖర్చులను కూడా ఏజెంట్లే భరించేలా చర్యలు తీసుకోవడంతో సమస్య సుఖాంతమైంది. షహ్నాజ్ ఈ నెల 7వ తేదీన సురక్షితంగా స్వదేశానికి చేరుకోనున్నారని అధికారులు వెల్లడించారు. వలస కార్మికుల భద్రత తమ ప్రభుత్వ ప్రాధాన్యతని, ఆపదలో ఉన్న ప్రతి తెలుగువారిని ఆదుకుంటామని సీఎం ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## మధ్యాహ్న భోజనంలో రాగిజావ కొనసాగింపు

### పాఠశాలల్లో మరోమూడేళ్ల కొనసాగేలా ఒప్పందం

### మంత్రి లోకేశ్ సమక్షంలో విద్యాశాఖ ఒప్పందం

**అమరావతి,మే 4 :** ఏపీ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. 2026–29 కాలానికి ఈ కార్యక్రమం కొనసాగనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని తరగతుల విద్యార్థులకు సన్నబియ్యంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మెనూలో మార్పులు చేసి ఎక్కువ మంది విద్యార్థులకు రుచికరమైన, శుచిగా భోజనం అందించేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక పర్యవేక్షణ వహిస్తున్నారు. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం మార్చి 2023లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఏప్రిల్‌తో కాలపరిమితి ముగిసింది. విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించే ఉద్దేశంతో మరో మూడేళ్లు కొనసాగించాలని విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది.



# బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి కలిసికట్టుగా ముందుకు రావాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట,04(సమయం న్యూస్) :** బాల్యవివాహాలు చట్టపరంగా నిషేధించబడినవని,18 సంవత్సరాల లోపు బాలికలు మరియు 21సంవత్సరాల లోపు బాలురకు వివాహం జరపడం చట్ట ప్రకారం నేరమని స్పష్టం చేశారు. బాల్యవివాహాలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా, వారి విద్యాభ్యాసాన్ని మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికల భవిష్యత్తు, ఆర్థిక స్వావలంబన, ఆరోగ్య భద్రతపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. సమాజంలో అజ్ఞానం, సంప్రదాయాల పేరుతో ఇలాంటి ఘటనలు జరుగుతుండటం ఆందోళనకరమని అన్నారు. తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక నాయకులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని బాల్యవివాహాలను నిరోధించడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, తమపై బలవంతంగా వివాహం జరపడానికి ప్రయత్నిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాలు మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాల్యవివాహాల నిరోధానికి ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎవరైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు గమనించినట్లయితే సమీప పోలీస్ స్టేషన్, డయల్ 100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. బాలల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ,"బాల్యవివాహాలకు చెక్ బాలల భవిష్యత్తుకు సెక్యూర్" అనే సందేశాన్ని సమాజానికి అందించారు.

# వైద్య రంగానికి ప్రభుత్వాలు మరింత సహకరించాలి

- మధుసూదన్ రెడ్డి
- వైద్యుడు కనిపించే దేవుడు : డాక్టర్. పట్నం మహేందర్ రెడ్డి
- పరిశోధనలతో వైద్యులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి : వీసీ రమేష్ రెడ్డి







**చేవెళ్ల మున్సిపల్,(మం) మే,4(సమయం న్యూస్) :** వైద్య రంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరింత సహాయ సహకారాలు అందించాలని ప్రఖ్యాత అరబిందో ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి తెలిపారు. చేవెళ్ల డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జనరల్ హాస్పిటల్, వైద్య కళాశాలలో ట్రోయ్ జియాంజ్ బ్యాచ్ 2020 గ్రాడ్యుయేషన్ డే లో శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి,కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రమేష్ రెడ్డి,యస్ ఆర్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ వరధా రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి వెలిగించి, విద్యార్థులకు పట్టాలను అందించారు. అనంతరంఆయన మాట్లాడుతూ దేశంలో 825 వైద్య కళాశాలలో మాత్రమే ఉన్నాయి 140 కోట్ల జనాభాకు తగువిధంగా వైద్య సేవలను ఇతర సిబ్బంది అందించలేక పోతున్నాయని చెప్పారు. ప్రతీ ఏటా కేవలం 65,000 మంది విద్యార్థులు మాత్రమే పీజీ కోర్సులను చదువుతున్నారని అన్నారు. వైద్య రంగానికి అవసరమైన మందులు ఇతర కంపెనీల ఉత్పత్తుల పెంచండి ప్రభుత్వమంతా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. వైద్య విద్యార్థులు వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలని తెలిపారు. అరవిందో ఫార్మా కంపెనీ మందులు అమెరికా లాంటి దేశాల్లో అగ్రగానిగా నిలుస్తుంది అంటే అందుకు నిబద్ధత, నాణ్యత, ధరలు పరిశోధనలు కారణమని వెల్లడించారు. పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కరోనా లాంటి భయంకరమైన వైరస్ ను భారతీయ వైద్యులు తరిమికొట్టి ప్రపంచాన్ని కాపాడాలని అలాగే విద్యార్థులు ఎల్లప్పుడూ పేదలకు సేవ చేసేలా ఉండాలని తెలిపారు. ప్రాచీన భారతదేశంలోని ధన్వంతరి నుండి నేటి వరకు చాలామంది వైద్యులు ఆదర్శంగా నిలుస్తున్నారని అసలు పేదదేశంలో వైద్యులు అంటే కనిపించే దేవుళ్ళుగా ప్రజలు భావిస్తారని అలాగే సేవలందించాలని ఆయన సూచించారు. చేవెళ్లలోని పట్నం మహేందర్ రెడ్డి జనరల్ హాస్పిటల్ లో వేలాదిమంది ప్రజలకు అనునిత్యం గత ఏడేళ్లుగా ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం వైద్యం లో అగ్రగామిగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి వైద్య విద్యార్థి నిరంతరం పరిశోధకుడుగా ముందుకు సాగాలని, తద్వారా పేదలకు సేవలు అందించడంతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని కాళోజి విశ్వవిద్యాలయం ఉపకులపతి రమేష్ రెడ్డి అన్నారు. మారుతున్న సాంకేతిక పరిస్థితులను పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వైద్య విద్యార్థులు మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు సిద్ధంగా ఉండాలని వెల్లడించారు. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల చమట కష్టంతో పేద విద్యార్థులు వైద్యులుగా ఎదుగుతున్నారని,ఇంకనూ రాణించాలని, తద్వారా వారిని సంతోష పెట్టాలని అన్నారు. మహేందర్ రెడ్డి కళాశాలలో చదువుతున్న వైద్య విద్యార్థులు ప్రపంచ ప్రఖ్యాత వైద్యులుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రిన్సిపాల్ జోయా రాణీ ,సూపరన్ టెండెంట్ రామకృష్ణారెడ్డి, పాలన అధిపతి గౌరీ హిందూపూర్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తదితరులు ఆయనతో ఉన్నారు.

# ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజావాణికీ సార్థకత ఉంటుంది






- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకటాచారి.

**వికారాబాద్, మే,04(సమయం న్యూస్) :** సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి, ఇంచార్జి డీఆర్ఓ రాజేశ్వర్, జడ్పీ సీఈవో సుధీర్ జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ. ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జవాబుదారీ తనంతో అధికారులు పనిచేయాలనే ఉద్దేశ్యంతో డివిజన్ స్థాయిలో ప్రజావాణిని నిర్వహించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో తాండూర్, వికారాబాద్ లలో నిర్వహించే ప్రజావాణిలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై ప్రతివారం సమీక్ష చేపడతామని ఆయన తెలిపారు. ప్రతి శాఖకు వచ్చిన అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. పరిష్కరించని పక్షంలో దానికి గల ఖచ్చితమైన కారణాలను తెలియజేయాలని ఆయన అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారం పట్ల అధికారులు పారదర్శకంగా పని చేయాలన్నారు. రెవెన్యూ కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు మండల తహసీలదార్లు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. భూమి సర్వేకు వచ్చిన దరఖాస్తులపై సత్వరమే స్పందించి పరిష్కార దిశగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు సంబంధించి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారికి సూచించారు. ప్రజావాణిలో ( 120) దరఖాస్తులు రాగా రెవెన్యూ, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లపై అధికంగా ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో డీఆర్డీఏ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, డీఎస్సీడిఓ జైపాల్ రెడ్డి, డిబిసిడిఓ మాధవ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" లో భాగంగా రుద్రారం రైతు వేదికలో రైతులతో నేల ఆరోగ్య పరిరక్షణ సమతుల్య ఎరువుల యాజమాన్యం సమావేశం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్-ఎల్లప్ప





**కొడంగల్ మండలం, మే,04(సమయం న్యూస్) :** రైతు వారము 4 మే నుండి 9 మే 2026, కార్యక్రమంలో భాగంగా నేల ఆరోగ్య పరిరక్షణ సమతుల్య ఎరువుల యాజమాన్యం ప్రకృతి వ్యవసాయం పౌరసరఫరాల శాఖ వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగు గురించి రుద్రారం రైతు వేదికలో సోమవారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నేల ఆరోగ్యం యొక్క గొప్పతనం, భూమిలో ఉన్నటువంటి సూక్ష్మ మరియు స్థూలా పోషకాలు , ఆ పోషకాల పనితనం 17 రకాల పోషకాలు అవసరం వాటి ఆవశ్యకత గురించి చెప్పడం జరిగింది. మట్టి నమూనాలు ఎలా తీయాలో డెమో స్టేషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్లప్ప, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్స్, ఎరువు దుకాణాల యజమానులు మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

## కీర్తిశేషులు ర్యాళ్లపేట రాములు జ్ఞాపకార్థం

- పెన్షన్ కోసం వచ్చిన వారికి టిఫిన్,మంచినీరు ఏర్పాటు చేసిన....
- రెండో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసూదన్ యాదవ్.
- ముఖ్యఅతిథిగా పాల్గొన మున్సిపల్ చెర్మెన్ నందారం ప్రశాంత్



**కొడంగల్ మున్సిపల్, మే,04(సమయం న్యూస్) :** కొడంగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్ తండ్రి కీర్తిశేషులు ర్యాళ్లపేట రాములు జ్ఞాపకార్థం పెన్షన్ కోసం వచ్చిన వయోవృద్ధులకు టిఫిన్ మరియు మంచినీరు ఏర్పాటు చేసిన కొడంగల్ మున్సిపల్,రెండవ వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ... పట్టణ కేంద్రంలోని రెండో వార్డ్ లోని పోస్ట్ ఆఫీస్ దగ్గర ప్రతి నెల పెన్షన్ కోసం వచ్చే వారికి తన సొంత ఖర్చులతో టిఫిన్ మరియు మంచినీరు ఏర్పాటు చేసినట్లు కొడంగల్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ కుమార్ మరియు ఈ కార్యక్రమంలో రాహుల్ యాదవ్ అక్షిత,నవిత,కోక్కల చందు కామ్సన్పల్లి శివకుమార్,మంగళ శేఖర్,హోటల్ చిన్న శివారెడ్డి బాకారం బాలు సెల్కంపేట మోహన్, బండి గోపాల్ పాశం సత్యప్ప జట్కల రాములుపాశం నాగప్ప.తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వారు తెలిపారు

## విమానం నుంచి దూకేసిన ప్రయాణికుడు..

**చెన్నై,మే04( సమయం న్యూస్) :** షార్జా నుండి చెన్నై చేరుకున్న ఎయిర్ అరేబియా విమానంలో ఆదివారం తెల్లవారుజామున ఒక భయంకరమైన సంఘటన చోటుచేసుకుంది. విమానం ల్యాండ్ అయి రన్‌వే నుంచి పార్కింగ్ ఏరియాకు కదులుతున్న సమయంలో, పుదుక్కోట్టైకి చెందిన ఒక ప్రయాణికుడు ఊహించని విధంగా ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్‌ను తెరిచి బయటకు దూకేశాడు. ఈ చర్యను గమనించిన పైలట్ వెంటనే అప్రమత్తం చేయడంతో జ×ాఖీ సిబ్బంది సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో అతను తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు వెల్లడైంది. ప్రయాణంలో రెండు సార్లు వాంతులు చేసుకున్న అతడు, విమానం ఆగిన వెంటనే బయటపడటానికి కంగారులో డోర్ తెరిచి దూకేసినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటన కారణంగా భద్రతా కారణ దృష్ట్యా ప్రధాన రన్‌వేను ఒక గంట పాటు మూసివేసి, విమానాలను ప్రత్యామ్నాయ రన్‌వేకు మళ్లించారు.

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్





**నిజామాబాద్, మే 04( సమయం న్యూస్).** ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన సిరికొండ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులను కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. 582 మార్కులు సాధించిన సుదీప్తినితో పాటు 550 పైన మార్కులు సాధించిన విద్యార్థులు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందిస్తూ, భవిష్యత్తులో మీరు ఏమి కావాలని కోరుకుంటున్నారని వారి లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించాలని వారికి హితవు పలికారు. జిల్లాలో 107 ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యిందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలు చాలా బాగా నడుస్తున్నాయని, ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధన విధులు నిర్వహిస్తున్నారని, పదవ తరగతి ఫలితాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం మౌలిక సదు- పాయాలు ఎంతగానో మెరుగుపర్చిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియుటిఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జెడ్పిహెచ్ఎస్ సిరికొండ గెజిటెడ్ హెచ్.ఎం సతీష్ కుమార్ పాల్గొన్నారు

## ఆర్మూర్ సబ్ కలెక్టర్ లో ప్రజావాణి.




**ఆర్మూర్ మే 04( సమయం న్యూస్). :** ఆర్మూర్ సబ్-కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ గారు ఈ రోజు ఆర్మూర్ సబ్-కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విభాగ స్థాయి అధికారులు అందరూ హాజరై పాల్గొన్నారు. ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించిన మొత్తం 4 వినతిపత్రాలు స్వీకరించబడినవి. అందిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించబడతాయని సబ్-కలెక్టర్ గారు హామీ ఇచ్చారు.

## ఉపాధి హామీ సేవల వేగవంతానికి కంప్యూటర్ల పంపిణీ: జిల్లా కలెక్టర్



**కామారెడ్డి మే04( సమయం న్యూస్). :** రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుండి సరఫరా చేసిన కంప్యూటర్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని 25 మండలాల ఎంపీడీఓలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ఉపాధి హామీ పథకంలో పారదర్శకత, వేగవంతమైన సేవల కోసం ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బంది మస్టర్లు, మెజర్‌మెంట్ బుక్‌లు, బిల్లులు ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయాలి. కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి" అని ఆదేశించారు. జిల్లాలోని 25 మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధి హామీ విభాగాల వినియోగం కోసం ఈ కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, జిల్లా జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్డీఓ ఎం. సురేందర్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

## పునరావసానికి పూర్తి సహకారం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.
- జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టులకు
- నిత్యవసర సరుకులు అందించిన: ఎస్పీ





**నారాయణపేట, మే.04(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమాజంలో శాంతి, భద్రతలను బలోపేతం చేయడంలో భాగంగా జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టులతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. 2018 సంవత్సరం సెప్టెంబర్ నెలలో మక్తల్ మండలం, జక్లేర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ ఏ భగత్ సింగ్ వయస్సు 29 సం. భార్య గద్వాల కు చెందిన భవాని అలియాస్ సుగుణ వయస్సు 27 సం. లు మావోయిస్టు దళంలో చేరి చత్తీస్ గడ్ అడవుల్లో ఉండి, అక్కడే వివాహం చేసుకుని జీవనం సాగించారు. అనంతరం ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో, మార్చి 03, 2026 న హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో మాజీ డీజీపీ (ఐపీఎస్) శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో లొంగిపోయి, జనజీవన స్రవంతిలోకి చేరారు. ఈ నేపథ్యంలో నేడు వారు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి ఒక నెలకు సరిపడా అవసరమైన నిత్యావసర సరుకులను క్వింటాల్ (బియ్యం, వంట పాత్రలు,కుక్కర్) అందజేశారు. అలాగే వారు భవిష్యత్తులో చేయాలనుకుంటున్న ఉపాధి, జీవన మార్గం గురించి ఆలోచించుకుని, ఒక నెల తర్వాత మళ్లీ కలవాలని సూచించారు. వారి పునరావాసానికి పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ...మావోయిస్టు దళాన్ని విడిచి జనజీవన స్రవంతిలోకి రావడం మంచి నిర్ణయమని, ఇకపై సమాజంతో కలిసిమెలిసి జీవిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలైన బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి అనర్థాలను అరికట్టడంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. అలాగే బీద ప్రజలకు సహాయం చేయడం, కుటుంబ సభ్యులతో సఖ్యతగా జీవించడం ద్వారా సమాజంలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (డి.ఏ.ఆర్) ఎం.డి. రియాజ్ హుల్ హక్, ఎస్బి ఎస్సై నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- సత్వర పరిష్కారానికి ఐటిడిఏ కృషి:పిఓ మంద మకరందు
- సంక్షేమమే లక్ష్యం - ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



**ఉట్నూర్ మే 04( సమయం న్యూస్,) :** గ్రామస్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని, వాటిని నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు, ఐటిడిఏ పిఓ మంద మకరందులతో కలిసి ఆయన 'ప్రజావాణి' గ్రామ సభ, 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని కలెక్టర్, పిఓ, ఎమ్మెల్యే కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను 10 నుంచి 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని, ఏడు ఆవాస ప్రాంతాలకు రూ. 25 లక్షలతో త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, అటవీ హక్కు పత్రాలు, రెవెన్యూ పట్టాల సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వ్యవసాయ వారోత్సవాల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో మట్టి పరీక్షలు చేయించుకోవాలని, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా పత్తి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే తీసుకోవాలని, నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని కేవలం జిల్లా కేంద్రానికే పరిమితం చేయకుండా, డివిజన్, మండల స్థాయిల్లోనూ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి దరఖాస్తును 30 రోజుల్లోగా పరిష్కరించి, బాధితులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, నియోజకవర్గ రహదారుల కోసం రూ. 36 కోట్లు కేటాయించగా, అందులో హీరాపూర్ రోడ్డు పనులకే రూ. 12 కోట్లు వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. ముత్నూర్, ఇంద్రవెల్లి ప్రాంతాల్లో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, హీరాపూర్‌ను పైలట్ ప్రాజెక్ట్ కింద పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా మార్చేందుకు ముఖ్యమంత్రి గారు సుముఖంగా ఉన్నారని వెల్లడించారు. గిరిజన విద్యార్థుల పర్యవేక్షణకు వాట్సాప్ మానిటరింగ్ వ్యవస్థను తెచ్చామన్నారు. ఐటిడిఏ పీఓ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలను 'గ్రీవెన్స్' రూపంలో నమోదు చేసుకొని రసీదు తీసుకోవాలని సూచించారు. 21 విభాగాలను సమన్వయం చేస్తూ సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పలువురు రైతులకు పలువురికి భూసార పరీక్షవిశ్లేషణ ధృవీకరణ పత్రాలను అందజేసి, విద్యుత్ జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్, పిఓ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, డీడీ అంబాజీ, ఈఈ తానాజీ, జీసీసీ డీఎం సందీప్, స్థానిక సర్పంచి తొడసం లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్




**కామారెడ్డి మే 04( సమయం న్యూస్).**

రాష్ట్ర సివిల్ సప్లైస్ శాఖ మంత్రి, ఇన్‌చార్జ్ మంత్రులు, ప్రధాన కార్యదర్శి, సివిల్ సప్లైస్ కమిషనర్ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో కలిసి సోమవారం వరి కొనుగోలు అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాబోయే ఐదు రోజుల పాటు అకాల, అనూహ్య వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లా పరిపాలనలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు చేసిన వరి వర్షాలకు తడవకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**జారీ చేసిన ముఖ్య సూచనలు:**

కొనుగోలు చేసిన వరిని తక్షణమే పీపీసీల నుంచి రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలి.

తగినంత తార్పాలిన్‌లు ఏర్పాటు చేసి అన్ని నిల్వలను సరిగా కప్పాలి.

డన్నేజ్ ఏర్పాటు చేసి తేమ నేలకు తగలకుండా సురక్షితంగా నిల్వ చేయాలి.

కొనుగోలు కేంద్రాల్లో నీటి నిల్వ లేకుండా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయాలి.

వర్షాల సమయంలో పీపీసీల వద్ద 24 గంటల పర్యవేక్షణ నిర్వహించాలి.

అత్యవసర తరలింపుల కోసం తగిన సిబ్బంది, వాహనాలు సిద్ధంగా ఉంచాలి.

వరి తరలింపులో అంతరాయం లేకుండా రైస్ మిల్లర్లు, రవాణా సంస్థలతో సమన్వయం కొనసాగించాలి.

రైతులకు అవగాహన కల్పించి, వరి గుంపులను కప్పడం, చుట్టూ కాలువలు త్రవ్వడం ద్వారా దిగుబడిని రక్షించుకునేలా సూచించాలి. రైతుల ప్రయోజనాలను కాపాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సజావుగా, సమర్థవంతంగా వరి కొనుగోలు కొనసాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీఓ సురేందర్, సివిల్ సప్లైస్ వెంకటేష్, డీఎం శ్రీకాంత్, డీసీఓ రామ్మోహన్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్, మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదం జరిగిన చోట తక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల.
- ఎంపీ శాసనసభ్యులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్.



**కాచిగూడ మే04( సమయం న్యూస్) :** ముషీరాబాద్ కావిడిగూడ భోలక్ పూర లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యులు ముఠా గోపాల్ లతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేస్ట్ ప్లాస్టిక్ మెటీరియల్ స్టోరేజ్ గోదాం, షాపులు, భవనాన్నీ సందర్శించి జరిగిన అగ్ని ప్రమాద వివరాలను భవనాల్లో ఉన్నటువంటి కుటుంబాల ద్వారా తెలుసుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగలేదని ఇద్దరికీ పొగతో కొంత ఇబ్బంది కలగడం తో సత్వరమే సరోజినీ దేవి ఆసుపత్రి అలాగే గాంధీ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ముందుగా ఎక్కడికక్కడే విద్యుత్ సరఫరాను నిలిపివేసి భవనాల్లో ఉన్నటువంటి వారిని సత్వరమే ఖాళీ చేయించడం జరిగిందని తెలిపారు. వేసవి కావడంతో ఎక్కువగా విద్యుత్ వాడకం వలన షార్ట్ సర్క్యూట్ అవటం జరిగిందని విద్యుత్ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసి అధికారులు జరిగిన అగ్ని ప్రమాదంపై సత్వరమే నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ పుష్పలత, విద్యుత్ శాఖ ఏడి శ్రీనివాస్, తాసిల్దార్ చందన, ఆర్ అండ్ బి, ఫైర్, జిహెచ్ఎంసి, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి డివిజన్ స్థాయి ప్రజావాణి

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**కరీంనగర్ మే04( సమయం న్యూస్) :** ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 4 నుండి ప్రతి సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్ర మీశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో ప్రజావాణి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇకనుండి జిల్లాస్థాయి ప్రజావాణితో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే జిల్లా స్థాయి ప్రజావాణికి, డివిజన్ స్థాయి అధికారులు రెవెన్యూ డివిజన్ స్థాయిలో జరిగే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# మంత్రులు, జడ్జీల పేర్లతో ఐపీఎల్ టికెట్ల దందా!

## ప్రముఖుల సంతకాలు ఫోర్జరీ.. ఉప్పల్‌లో కేటుగాళ్ల ముఠా అరెస్ట్

**హైదరాబాద్ మే 4( సమయం న్యూస్)** ఐపీఎల్ క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకొని సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న ఒక ముఠా గుట్టును ఉప్పల్ పోలీసులు రట్టు చేశారు. సామాన్య ప్రజలను బురిడీ కొట్టించడం మాత్రమే కాకుండా, ఏకంగా దేశంలోని అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తుల పేర్లను వాడుకొని అధికారులను మోసగించిన తీరు విస్తుగొలుపుతోంది.

**వివరాల్లోకి వెళ్తే..**మే 3వ తేదీన ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు, స్టేడియం పార్కింగ్ వద్ద టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన ఉప్పల్ ఎస్.ఐ. ఏ. మాధవరెడ్డి బృందం అక్కడ అనుమానాస్పదంగా ఉన్న ఒక మహీంద్రా థార్ వాహనాన్ని (టీఎస్-40డీడీ-6768) తనిఖీ చేసింది. పోలీసుల విచారణలో నిందితులు చేసిన నేరం వెలుగులోకి వచ్చింది.

**అత్యున్నత స్థాయి ఫోర్జరీ:**కేవలం బ్లాక్‌లో టికెట్లు అమ్మడం మాత్రమే కాకుండా, ఈ ముఠా పెద్ద స్కెచ్ వేసింది. గూగుల్ నుండి గౌరవనీయులైన జడ్జీలు, మంత్రులు మరియు గవర్నర్ల అధికారిక లెటర్ హెడ్‌లను డౌన్‌లోడ్ చేసేవారు. వాటిపై ప్రముఖుల సంతకాలను ఫోర్జరీ చేసి, హైదరాబాద్, తమిళనాడు మరియు కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లకు సమర్పించేవారు. అలా వీవీఐపీల కోటాలో ఖరీదైన 'కాంప్లిమెంటరీ' టికెట్లను పొంది, ఆ తర్వాత వాటిని అవసరమున్న వారికి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ముగ్గురి అరెస్ట్ - ముగ్గురు పరారీ:**ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న గట్టమనేని అశోక్, కంకనాల దినేష్ మరియు సింగమనేని వేణుమాధవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి కాగా, మిగిలిన ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పల్కూరు గ్రామానికి చెందిన వారు. కాగా, చెన్నైకి చెందిన ఆశిష్, సెంథిల్ మరియు తాన్సిల్ అనే ముగ్గురు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు:** రూ. 1,10,000 విలువైన ఐపీఎల్ టికెట్లు (తలా రూ. 22 వేల విలువ గల 5 టికెట్లు). మహీంద్రా థార్ వాహనం. 5 మొబైల్ ఫోన్లు మరియు 5 ఫోర్జరీ చేసిన లెటర్ హెడ్‌లు.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ పర్యవేక్షణలో, ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్ మరియు ఇతర ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఉప్పల్ పోలీసులు మరియు ఎస్.ఓ.టి బృందం ఈ కేటుగాళ్లను పట్టుకున్నారు. నిందితులను సోమవారం నాడు కోర్టులో హాజరుపరిచారు.

# ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహణ

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి సమయం న్యూస్ మే 05** జిల్లాలో నేటి నుండి ప్రతి సోమవారం డివిజన్ స్థాయిలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఆయా డివిజన్ పరిధిలోని ప్రజలు తమ డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారుసోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలను ఆయా వివరాలు అడిగి తెలుసుకుని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజావాణితో పాటు ఆందోల్, సంగారెడ్డి డివిజన్లకు సంబంధించిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్ కేంద్రాలలోని సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యాలయాలలో ప్రతి సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుపుతుందని తెలిపారుడివిజన్ పరిధిలోని ఆయా మండలాల ప్రజలు తమ డివిజన్ కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికి హాజరై తమ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. అలాగే, డివిజనల్ స్థాయి అధికారులందరూ తమ తమ డివిజన్లలో తప్పనిసరిగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరై, అందిన ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి పరిష్కరించాల న్నారుప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేసిన తర్వాత 30 రోజులలోపు పరిష్కరించాలని, ఏవైనా కారణాల వల్ల ఆలస్యం అయితే వాటిని స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు జిల్లాలో డివిజన్ వారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపైమొత్తం(134) ఫిర్యాదులు అందాయని, అందులో కలెక్టరేట్ కు 57 ఫిర్యాదులు , సంగారెడ్డి డివిజన్ కు 29, ఆందోల్ కు 02, నారాయణఖేడ్ కు 24, జహీరాబాద్ ప్రజావాణికి 22 ఫిర్యాదులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారుఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, జిల్లా అధికారులు, సంగారెడ్డి, ఆందోల్ డివిజన్ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, పాల్గొన్నారు.

# బోర్డర్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

- చెక్ పోస్ట్ ల దగ్గర అప్రమత్తంగా ఉండాలి.
- ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించాలి,
- నెంబర్లను రిజిస్టర్ లో నమోదు చేయాలి.



**నారాయణపేట, మే,04(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రబి సీజన్ వరి కొనుగోళ్ల సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు అక్రమంగా ధాన్యం రాకుండా నిరోధించేందుకు, అలాగే బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మొత్తం 06 బోర్డర్ చెక్‌పోస్టులు, 01 అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. అవి జలాల్పూర్, కనుకుర్తి, చేగుంట, కృష్ణ బ్రిడ్జ్, సమస్తాపూర్, ఉజ్జల్లి, లాల్కోట వంటి ముఖ్య ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగిస్తున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS నారాయణపేట మండలంలోని జలాల్పూర్ చెక్‌పోస్ట్ (కర్ణాటక సరిహద్దు)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను, సిబ్బందిని పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాల పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు.అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైతే వీడియో రికార్డింగ్‌తో తనిఖీలు కొనసాగించాలని సూచించారు.అదేవిధంగా సరిహద్దు మార్గాలన్నింటిపై నిరంతర నిఘా ఉంచి, గ్రామీణ మార్గాలు సహా అన్ని ప్రవేశ దారుల్లో తనిఖీలు కట్టుదిట్టం చేయాలని తెలిపారు. అక్రమంగా వరి ధాన్యం రాకుండా, పశువుల అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు.ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యంపై కూడా ఎస్పీ దృష్టి సారించారు. తగినంత మంచినీరు తీసుకోవాలని, వేడి నుండి రక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని సూచించారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

# అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత కేసు నమోదు

## అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు యాలాల ఎస్సై -విఠల్ రెడ్డి

**యాలాల మండలం, మే,04(సమయం న్యూస్) :** యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాగసముందర్ గ్రామానికి చెందిన తోకలి రాజు, మహేష్ ల యొక్క రెండు ఇసుక ట్రాక్టర్లు( ట్రాక్టర్ నెంబర్ :టీూ3జు0701, ట్రాలీ నెంబర్ రాయలేదు2. ట్రాక్టర్ నెంబర్ :టీూ34దీ6954 ట్రాలీ నెంబర్టీూ34దీ6955) ను విశ్వనాథ్ పూర్ గేటు సమీపంలో పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.ఎవరైనా ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట రీత్యా చర్యలు ఉంటాయని యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.



# చలివేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



**హైదరాబాద్ మే04( సమయం న్యూస్) :** కలెక్టరేట్ కు వివిధ పనులపై నిత్యం వచ్చే ప్రజలకు చల్లటి త్రాగు నీరు అందించే దిశగా కలెక్టరేట్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఇన్చార్జి డిఆర్ఓ శ్రీధర్, ఏవో విజయలక్ష్మితో కలిసి చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ క్యాంటీన్ ను సందర్శించారు. నిర్వహకులు మహేష్ కు వచ్చే కస్టమర్లకు మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, క్యాంటీన్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ కస్టమర్ల సంఖ్యను పెంచుకోవాలని , క్యాంటీన్ లో పనిచేసే వారి సంఖ్య, చేపట్టే వంటలు తెలుసుకున్నారు. అలాగే క్యాంటీన్ పరిసర ప్రాంతాలను ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఓ శ్రీధర్, ఏవో విజయలక్ష్మి, నిర్వాహకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేరళలో కాంగ్రెస్ విజయం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం

**హైదరాబాద్ మే04( సమయం న్యూస్)** :కేరళలో కాంగ్రెస్ పార్టీ విజయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఉన్నంత వరకు "కాంగ్రెస్ ముక్త భారత్" అసాధ్యమని అన్నారు. దేశంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.బీజేపీ మతతత్వ రాజకీయాలను విమర్శిస్తూ, ప్రజాస్వామ్యం తప్పకుండా గెలుస్తుందని చెప్పారు. కేరళలో పార్టీ విజయానికి నాయకత్వం వహించిన నేతలకు అభినందనలు తెలిపారు.తెలంగాణలో బీజేపీకి అవకాశం లేదని, ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్‌ను మళ్లీ ఆదరిస్తారని మంత్రి పేర్కొన్నారు.

# శ్రీ మహా లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల పరిశీలన.



**కొడంగల్ మున్సిపల్, మే,04(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ లో శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులను సి ఎం స్పెషల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు, దేవాదాయ కమిషనర్ హనుమంతు రావు, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, కాడ అభివృద్ధి అధికారి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

# ప్రజావాణికి 19 ఫిర్యాదులు

- ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను.



**నారాయణపేట, మే,04(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి.హాజరయ్యారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను అదనపు కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న అదనపు కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 19 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ పీ.హెచ్.సీ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ సీ. హెచ్.ప్రియాంక



**ధన్వాడ మండలం, మే.04(సమయం న్యూస్) :** జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సీ. హెచ్. ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని పలు వార్డులను పరిశీలించారు. మందులను చూసి,గడువు తీరిన మందులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. టీకాల గదిని చూశారు. వ్యాక్సినేషన్, ఈఎన్ సీ, ఎన్.సీ. డీ నమోదు గురించి ఆరా తీశారు. ఎంత మంది స్టాఫ్, ఏ ఎన్ ఎం లు ఉన్నారని మెడికల్ ఆఫీసర్ ను ప్రశ్నించారు. కేంద్రంలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని, గత నెలలో నమోదైన గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత నెలలో జరగాల్సిన ప్రసవాలలో ఎన్ని ఆస్పత్రిలో జరిగాయి?.. ఎన్ని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు?. ఎన్ని సాధారణ ప్రసవాలు జరిగాయి?. ఎన్ని సెక్షన్ జరిగాయని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన వాళ్లు ఎంత మంది ఉన్నారనే వివరాల గురించి ఆమె వాకబు చేశారు. స్టోర్ రూమ్, ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. ఈ డీ డీ క్యాలెండర్, ఔట్ పేషంట్స్ ఆన్ లైన్ నమోదు, రోజువారీ చికిత్సలు పొందిన రోగుల సంఖ్య కంప్యూటర్ లో నమోదు చేశారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించారు.

## కొనుగోలు కేంద్రాలలో రైతులకు కనీస వసతులు కల్పించాలి

-జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక.



**ధన్వాడ మండలం, మే.04(సమయం న్యూస్) :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో రైతులకు తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె ధన్వాడ మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. జూనియర్ కళాశాల ఆవం-ణలో రైతులు ఆరబోసిన వరి ధాన్యం కుప్పల వద్దకు వెళ్లి ఎన్ని రోజుల నుంచి ధాన్యం ఆర బెడుతున్నారని మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోజులు ఆరబెడితే తేమ శాతం వస్తుందని అడిగారు. ధాన్యం తేమ శాతాన్ని చూశారు. కేంద్రంలో గన్నీ బస్తాలు లేవని కొందరు రైతులు ఫిర్యాదు చేయగా వెంటనే సంబంధిత అధికారిని కలెక్టర్ వివరణ కోరారు. మంగళ వారం 5 వేల గన్నీ బస్తాలు వస్తాయని, వాటిని రైతులకు పంపిణీ చేసి, కేంద్రంలో ఉన్న ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని కేంద్రం ఇన్ ఛార్జ్ కలెక్టర్ కు జవాబిచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ తహశీల్దార్ సింధుజా, ఎంపీడీవో, సింగిల్ విండో కార్యాలయ సీ. ఈ వో, ఏ ఈ వో పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ శాఖ ప్రగతి పై కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక (IAS) సమీక్ష



**నారాయణపేట, మే.04(సమయం న్యూస్) :** జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో గృహ నిర్మాణ శాఖ ప్రగతి పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి తో కలిసి సమీక్ష జరిపారు. జిల్లాలోని మండలాల వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యం సాధించిన పురోగతి గురించి ఆమె హౌసింగ్ పీడీ శంకర్, ఏ ఈ లతో చర్చించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, అర్హులైన వారికి మంజూరైన ఇండ్లను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయించాల్సిన బాధ్యత ఏ ఈ ల పై ఉందన్నారు. మండలాల వారీగా ఇచ్చిన టార్గెట్లను చేరుకోవాలని ఏ ఈ లను ఆదేశించారు. ప్రతీ రోజూ క్షేత్రస్థాయిలో ఇండ్ల నిర్మాణాలను పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాలలో సర్పంచుల తో సమన్వయం చేసుకుని లబ్ధిదారులు తొందరగా ఇండ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఇండ్ల నిర్మాణాలకు స్త్రీ నిధి ద్వారా రుణాలు ఇప్పించి పూర్తి చేయించాలన్నారు. జిల్లాకు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల టార్గెట్ పూర్తి చేసేందుకు ప్రతీ ఇంటి నిర్మాణ పురోగతి గురించి ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేయాలని ఏ ఈ లకు సూచించారు. వచ్చే సమావేశానికల్లా ఇచ్చిన టార్గెట్లలో ఎంత వరకు పూర్తి చేశారు?.. ఇంకా ప్రారంభించని ఇండ్లు ఎన్ని? కారణం ఏమిటి? ఏం చేస్తే నిర్మాణాలు ప్రారంభం అవుతాయి అనే వివరాలతో కూడిన యాక్షన్ ప్లాన్ తనకు ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బస్తాలు అందుబాటులో ఉంచాలి

-జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక.

**మరికల్ మండలం, మే.04(సమయం న్యూస్) :** వరి కొనుగోలు కేంద్రాల లో అవసమైన్నని గన్నీ బస్తాలను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. కేంద్రాలలో వరి ధాన్యం తడిస్తే సంబంధిత అధికారిదే పూర్తి బాధ్యత అని ఆమె తేల్చి చెప్పారు. సోమవారం కలెక్టర్ మరికల్ మండలం తీలేర్ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రానికి ఇంత వరకు ఎంత మంది. రైతులు ఎన్ని బస్తాల ధాన్యం తీసుకువచ్చారని, ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని సీ.ఈవో ను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది రైతులు తమకు గన్ని బస్తాలు ఇవ్వలేదని, కేంద్రంలో గన్ని బస్తాలు ఎక్కువ ఉంచాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆమె సూచించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కేంద్రంలో ధాన్యం తడిసి పోకుండా టార్పాలిన్లు ఉంచుకోవాలన్నారు. తమకు ఇంతవరకు అధికారులు టార్పాలిన్లు ఇవ్వలేదని, తామే ఇంటి నుంచి తీసుకువచ్చి సాయంత్రం ధ్యానం పై కప్పి వేస్తున్నామని కొందరు రైతులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కేంద్రానికి



సరిపడా టార్పాలిన్లను తెప్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## అకాల వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- రైతులకు నష్టం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలి
- ఉత్తంకుమార్ రెడ్డి
- ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కలెక్టర్లు కృషి చేయాలి
- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు



**నారాయణపేట, మే.04(సమయం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై హైదరాబాద్ నుండి పలువురు మంత్రులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రిపొన్నం ప్రభాకర్, పశుసంవర్ధక శాఖ,పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకాటి శ్రీహరి,ఐటీ,పరిశ్రమలు ఉ వాణిజ్యంశాఖల మంత్రి శ్రీధర్ బాబు, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ, వృద్ధుల సంక్షేమ, మరియు ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖల మంత్రి అట్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావంతో ధాన్యం తడిచే పరిస్థితులు ఏర్పడుతున్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వర్ష సూచనలు ఉన్నప్పుడల్లా వెంటనే రైతులకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ స్థాయి వరకు వ్యవసాయ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండి రైతులను ముందుగానే హెచ్చరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా టార్పాలిన్లు, గిడ్డంగి సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిట్టచివరి రైతు వరకూ న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. రాబోయే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున అన్ని జిల్లాల్లో ముందస్తు చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని, ధాన్యం, మొక్కజొన్న సహా ప్రతి రైతు ఉత్పత్తిని కొనుగోలు చేసి చిట్టచివరి రైతుకు కూడా న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ మే నెల ధాన్యం కొనుగోలుకు అత్యంత కీలకమని, అధికారులందరూ సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం గా పూర్తి చేయాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల కలెక్టర్లు ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత బాధ్యతతో, సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఈ సీజన్‌లో గత రెండు సీజన్లతో పోలిస్తే అధికంగా ధాన్యం ఉత్పత్తి నమోదైనందున, కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని నిరంతరం సమీక్షిస్తూ పరిస్థితిని అదుపులో ఉంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను కూడా వెంటనే గుర్తించి పరిష్కరించేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత ఇంచార్జి మంత్రులకు తెలియజేసి తక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా ముందస్తుగా చెయ్యాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, టార్పాలిన్ల కొరత లేకుండా చూసుకోవాలని, రైస్ మిల్లర్లతో సమన్వయం పెంచాలని అన్నారు. అవసరమైన గోదాములు లేదా మార్కెట్ యార్డ్ షెడ్యూల్లో ధాన్యం భద్రపరచాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ) శ్రీను పాల్గొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వరి మరియు మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి స్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం చేరుకున్నదని, వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తైన 24 గంటల్లోపే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన రైతులకు వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు....

## జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకటచారి అధికారులకు ఆదేశం



**వికారాబాద్, మే.04(సమయం న్యూస్) :** జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకటా చారి అధికారులను ఆదేశిం చారు. సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, అకాల వర్షాల వల్ల వరి ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాల ఇన్చార్జి మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు ఆన్లైన్ ద్వారా తమ సూచనలను, అభిప్రాయాలను వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వెంకటాచారి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ...జిల్లాలోని 129 వరి కొనుగోలు కేంద్రాల్లో అన్ని సదుపాయాలను సమకూర్చుకొని రైతులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారుల సూచించారు. మార్కెటింగ్ అధికారులు వరి కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులను సరఫరా చేయాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తూనిక, తేమ,వరిని ఆరబెట్టే యంత్రాలతో పాటు తాడిపత్రీలను సమకూర్చుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిచిపోకుండా ముందస్తుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మురళీకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిసిఒ నాగార్జున, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ వెంకట్ రెడ్డి, అదనపు డిఆర్డిఓ నర్సింలు పాల్గొన్నారు.

# నీటి సరఫరాకు జిల్లాకు రూ.కోటి

- సులభతరంగా వాహన రిజిస్ట్రేషన్లు
- అదనపు వాహన రిజిస్ట్రేషన్ అథారిటీగా వాహన డీలర్లు
- ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై సలహా మండలి
- వివిధ శాఖలపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, మే 4 :** రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సరఫరా సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నీటి సరఫరా కోసం జిల్లా కలెక్టర్లకు రూ.1 కోటి చొప్పున నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. కొరత ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. బోర్లు కూడా మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసేలా వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించేందుకు సీఎం ఆమోదాన్ని తెలియచేశారు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తి అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందించే పౌరసేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం మరింత పెంచేందుకు, సమర్ధంగా వినియోగించేందుకు వీలుగా నిపుణులతో కూడిన సలహా మండలి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించాలని సీఎం సూచనలు చేశారు. మైనింగ్ కార్యకలాపాలను సమర్ధంగా నిర్వహించేందుకు మధ్యప్రదేశ్ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్న తీరును అధ్యయనం చేసి ఏపీలోనూ అమలు చేసేలా చూడాలన్నారు. అవేర్ సాంకేతికతను వినియోగించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న ప్రాంతాల్లో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలకు ఉపశమనం కలిగేలా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్‌ను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వచ్ఛంధ సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలని స్పష్టం చేశారు.

### అత్యవసర సేవలు మినహా అన్నీ ఆన్ లైన్లోనే

ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలు మెరుగ్గా అందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవల్లో మెరుగైన ప్రజాభిప్రాయం కోసం పబ్లిక్ కనెక్ట్ అనేది కీలకమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల్లో విశ్వాసాన్ని, క్రెడిబిలిటీని పెంచేలా ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రతీ ప్రభుత్వ శాఖ నిర్దేశిత ప్రమాణాలకు తగినట్టుగా పనిచేయాల్సిందేనని ముఖ్యమంత్రి సూచించారు. పంటలకు ధర విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మార్కెట్‌ను విశ్లేషించి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్టీజీఎస్ అధికారులను సీఎం ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేలా సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో 3 రోజుల పాటు, హెచ్ ఓడీలు 6 రోజుల పాటు, జిల్లా కలెక్టర్లు 8 రోజుల పాటు 7 క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని నిర్దేశించారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం కాల్ సెంటర్ ద్వారా వివరాలను సేకరించాలని సీఎం సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఉత్తమ విధానాలు అనుసరించాలన్నారు. అధికారులు ఏ అంశంలో ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారో అక్కడ మంచి ఫలితాలు వస్తున్నాయని.. మిగిలిన చోట్ల కూడా ఇదే చొరవ చూపాలన్నారు. అత్యవసర సేవలు మినహా ప్రభుత్వ శాఖలు అందించే మిగతా అన్ని సేవల్ని ఆన్ లైన్ లో అందించాలని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధం ముగిసిన తర్వాత అవేర్ ద్వారా వచ్చే డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా లభించే ప్రాంతాలను మత్స్యకారులకు అందజేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఈ సమీక్షకు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి, సీఎస్ జి. సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న
# సినీ నటి త్రిష
### విజయ్ విజయం కోసమేనా ఈ మొక్కులు!

**తిరుమల, మే 4 :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రముఖ సినీ నటి త్రిష కృష్ణన్ తన 43వ పుట్టినరోజు సందర్భంగా సోమవారం వేకువజామున స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయం మహా ద్వారం వద్దకు చేరుకున్న వీరికి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆలయంలోనికి ప్రవేశించిన త్రిషా కృష్ణన్ ముందుగా ఆలయంలోని ధ్వజస్తంభానికి నమస్కరించుకొని స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అధికారులు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన సినీ నటి త్రిష కృష్ణన్‌ను చూసేందుకు మరియు ఆమెతో సెల్ఫీ ఫోటోలు దిగేందుకు భక్తులు, అభిమానులు ఉత్సాహం చూపడంతో ఆలయం పరిసర ప్రాంతాలలో సందడి వాతావరణం ఏర్పడింది. అభిమానులు ఫోటోలు తీసుకుంటున్న సందర్భంలో ఒక అభిమాని విజయం పక్కా మనదే మేడం అని అనడంతో ఆమె నవ్వుకుంది. సినీ నటి త్రిష కృష్ణన్ తన తిరుమల పర్యటనకు సంబంధించిన విషయాలను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో "ఉత్తమ రోజు" అని పేర్కొంటూ తన ఆనందాన్ని అభిమానులతో కలిసి పంచుకున్నారు.

# ఎన్డీఏ విజయంపై పవన్ అభినందనలు




**అమరావతి, మే 4:** తమిళనాడు, కేరళం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆ మార్పును తమ తీర్పు ద్వారా స్పష్టంగా తెలియజేశారని పేర్కొన్నారు. అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకున్న ఎన్డీఏకు ఈ సందర్భంగా పవన్ శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రజల నమ్మకాన్ని పొందేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొన్ని సంవత్సరాలుగా కృషి చేశారని, ఇప్పుడు దానికి ఫలితం దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వం లో పశ్చిమ బెంగాల్ ఉంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో సురక్షితంగా ఉంటామన్న విశ్వాసంతోనే ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని పవన్ అన్నారు. ఈ భారీ విజయానికి భాగస్వాములైన మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీజేపీ పశ్చిమ బెంగాల్ నేత సువేందు అధికారికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. అస్సాం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి మరోమారు విజయాన్ని సాధించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు, పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమికి విజయాన్ని మళ్లీ అందించిన ఎన్.ఆర్.కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి రంగసామికీ పవన్ అభినందనలు తెలిపారు. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ వైపే ప్రజలు మొగ్గు చూపారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే మంచి విజయాన్ని సాధించిన విజయ్‌ను మనసారా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే– బీజేపీ కూటమి పోరాటం బలంగా సాగిందని, అదే విధంగా కేరళంలోనూ మెజారిటీ ఓటర్లు మార్పునే కోరుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ నాయకత్వానికి కూడా డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల పోరాటంలో విజయం సాధించిన అందరికీ పవన్ కల్యాణ్ పేరుపేరున శుభాభినందనలు తెలియజేశారు.

# ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారు
### హర్షం వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్
### తమిళనాడు విజయ్‌కు అభినందనలు



**అమరావతి, మే 4:** అస్సాం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఎన్నికల్లో ఎన్డీఏకు లభించిన విజయాన్ని స్వాగతిస్తూ లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టి ఎన్డీఏకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వచ్చిన ఎన్నికల ఫలితాలు అభివృద్ధి, స్థిరత్వం, నిర్ణయాత్మక నాయకత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని కోరుకుంటు న్నారని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం వేగం, విస్తృత స్థాయి, పారదర్శకతతో కూడిన అభివృద్ధి వైపు సాగుతోందని వెల్లడించారు. ఈ ఎన్నికల ఫలితాలు ఆ దిశగా ప్రజల మద్దతును మరింత బలపరిచాయని చెప్పారు. అభివృద్ధి, అవకాశాలు, సమగ్ర ప్రగతి లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారతదేశానికి బలమైన మద్దతుగా ఈ తీర్పు నిలిచిందని మంత్రి లోకేశ్ అన్నారు. మరోవైపు తమిళనాడు ఎన్నికల్లో విజయం వైపు దూసుకెళ్తున్న టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు కూడా మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. 'తమిళనాడులో అద్భుతమైన తొలి ఎన్నికల విజయం సాధించిన విజయ్‌కు అభినందనలు. ఈ ఫలితం రాష్ట్ర ఓటర్ల మారుతున్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, దాని రాజకీయ ముఖచిత్రానికి ఒక కొత్త కోణాన్ని అందిస్తోంది. ఆయన ప్రజా జీవితంలోకి అడుగుపెడుతూ బాధ్యత, నిబద్ధతతో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కృషి చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అంటూ పోస్టు పెట్టారు.

# విజయ్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు



అమరావతి, మే 4: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత, దళపతి విజయ్ గెలుపొందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. దళపతి విజయం సాధించడంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తమిళ ప్రజలకు సేవ చేసే దిశగా విజయ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే ఆ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చంద్రబాబు కోరారు. 'తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయ్‌కు లభించిన అద్భుత విజయం పట్ల వారికి నా అభినందనలు తెలియజేస్తున్నాను. తమిళనాడు ప్రజలకు సేవ చేసేందుకు చేపట్టే ప్రతి పనిలో విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఆ రాష్ట్ర ప్రజల పురోగతి, శ్రేయస్సుకు అర్థవంతంగా తోడ్పడేందుకు విజయ్ చేస్తున్న కృషికి సంపూర్ణ విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పోస్టు పెట్టారు.

# పిడుగుపాటుకు బాలిక దుర్మరణం

**అల్లూరి సీతారామరాజు, మే 4:** డుంబ్రిగుడ మండలంలో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. భారీ వర్షాల కారణంగా పిడుగుపాటుకు గురై బాలిక మృతిచెందింది. ఖండ్రూం పంచాయతీ సింధేరిగూడలో ఈరోజు (సోమవారం) మధ్యాహ్నం మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం మొదలవ్వడానికి ముందే గ్రామానికి సమీపంలోని కొండకు కొంకోడి కూర సేకరించేందుకు సొంగుల దివ్య (13) వెళ్లింది. తన అక్క, మరో ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి కొండపైకి వెళ్లింది. కొంకోడి కూర సేకరణ అనంతరం తిరుగు ప్రయాణంలో గ్రామానికి వస్తుండగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగుపాటుకు గురై దివ్య ప్రాణాలు కోల్పోయింది. దీంతో చిన్నారిని కొండ పైనుంచి స్నేహితులు మోసుకొచ్చారు. ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మరోవైపు సింధేరిగూడలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**కాకినాడ, మే 4:** ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 54 మంది లబ్దిదారులకు రూ.26.41 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్దిదారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 835 మంది లబ్దిదారులకు రూ.5.93 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు మంత్రి వెల్లడించారు.

# బీజేపీ విజయంపై విజయవాడలో సంబరాలు
### ఇది చారిత్రాత్మక విజయమన్న కేంద్రమంత్రి వర్మ

**విజయవాడ, మే 4:** పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ ఆధిక్యం కనబర్చడంపై విజయవాడలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్వీట్లు తినిపించి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకోగా.. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం చరిత్రాత్మకమన్నారు. అక్కడ కమ్యూనిస్టుల పాలనలో బీజేపీ నేతలపై దాడులు జరిగాయని విమర్శించారు. 2011లో ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా.. 2021లో 70 స్థానాల్లో బీజేపీ విజయం సాధించిందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు దాదాపు రెండు వందల స్థానాల్లో బీజేపీ విజయం దిశగా దూసుకెళ్తోందన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ.. అరాచకాలు, విధ్వంసకర ధోరణికి పాల్పడ్డారని, దేశ హితానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్లే మమత గెలుస్తూ వచ్చారని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేవలం సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి, రాష్ట్ర ప్రయోజనాల కన్నా తన స్వార్ధం చూసుకున్నారని మమతా బెనర్జీపై కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలింగ్ రోజు కూడా అనేక దాడులు చేయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిని అధిగమించి అక్కడి ప్రజలు మమత కుట్రలను తిప్పి కొట్టారన్నారు. బీజేపీపై నమ్మకంతో దాదాపు 200 స్థానాల్లో విజయం కట్టబెట్టారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో చొరబాట్లను మమతా ప్రోత్సహించడం వల్లే గెలిచారంటూ తాము చెప్పిన మాటలే ఇప్పుడు నిజమని తేలాయన్నారు. బీజేపీ అక్కడ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూనే ఉందన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రం వెస్ట్ బెంగాల్‌లో బీజేపీ జెండా రెపరెపలాటడటం ఆనందంగా ఉందన్నారు. దేశంలో ప్రజలకు ఒకే చట్టం, ఒకే జాతీయ పతాకం ఉండాలని 1951లో ఇదే వెస్ట్ బెంగాల్‌లో ఆయన ఉద్యమం చేశారని గుర్తుచేశారు. పార్టీ ఆవిర్భావం, శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సమయంలో వెస్ట్ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడం గొప్ప విషయమని శ్రీనివాస వర్మ అన్నారు. భవిష్యత్తులో పశ్చిమ బెంగాల్ అభివృద్ధిలో దూసుకుపోతుందని స్పష్టం చేశారు. కేరళంలో బీజేపీ రెండు స్థానాలతో అసెంబ్లీలోకి అడుగు పెట్టబోతోందన్నారు. తమిళనాడులో స్టాలిన్ పార్టీ కూడా ఓటమి దిశగా పయనిస్తోందన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందని ప్రచారం చేసిన వారిని ప్రజలే ఓడించారన్నారు. బీజేపీకి విజయాన్ని అందించిన ప్రధాని మోదీ, అమిత్ షా, ఇతర నేతలు, కార్యకర్తలకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ధన్యవాదాలు తెలియజేశారు.





# ముంబై జయభేరి!

**సొంత గడ్డపై చెలరేగిన ముంబై ఇండియన్స్ ■ లక్నో సూపర్ జెయింట్స్ పై ఘన విజయం**

**ఆరు వికెట్ల తేడాతో ఎంఐ గెలుపు ■ క్రీజులో శివమెత్తిన రోహిత్ శర్మ, రికెల్టన్**

**వృథా అయిన పూరన్ విధ్వంసం ■ ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే లక్ష్య ఛేదన**

**ముంబై, మే 4:** ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ (ఎంఐ) అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్ లో భారీ లక్ష్య ఛేదనలో ఏమాత్రం తడబడకుండా ఆడి లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ) పై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ బ్యాటర్లు ఆది నుంచే లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 18.4 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 229 పరుగులు సాధించి అద్భుత విజయాన్ని తమ ఖాతాలో వేసుకున్నారు. ఇంకా ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే ముంబై ఈ కష్టమైన లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోవడం విశేషం.

### వృథా అయిన పూరన్ శ్రమ..

అంతకుముందు టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు ముంబై బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా నికోలస్ పూరన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 21 బంతుల్లోనే 63 పరుగులు చేసి లక్నోకు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడుగా మిచెల్ మార్ష్ 25 బంతుల్లో 44 పరుగులు చేయగా.. చివర్లో హిమ్మత్ సింగ్ 31 బంతుల్లో 40 పరుగులతో అజేయంగా నిలిచాడు. వీరంతా చెలరేగడంతో లక్నో భారీ స్కోరు నమోదు చేసింది. ముంబై బౌలర్లలో కార్బిన్ బాష్ రెండు ఓవర్లు వేసి 20 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. విల్ జాక్స్, రఘు శర్మ తలా ఒక వికెట్ తీసి లక్నోను కట్టడి చేసే ప్రయత్నం చేశారు.



### చెలరేగిన రోహిత్, రికెల్టన్..

229 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ కు బ్యాటర్లు శుభారంభం అందించారు. రోహిత్ శర్మ క్రీజులో పాతుకుపోయి పరుగుల సునామీ సృష్టించాడు. 44 బంతుల్లోనే 84 పరుగులు చేసి జట్టు విజయానికి గట్టి పునాది వేశాడు. మరో ఎండ్ లో రేయాన్ రికెల్టన్ లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 32 బంతుల్లోనే 83 పరుగులు సాధించి మ్యాచ్ ను పూర్తిగా ముంబై వైపు తిప్పేశాడు. చివర్లో నమన్ ధీర్ 12 బంతుల్లో 23 పరుగులతో నాటౌట్ గా నిలిచి లాంఛనం పూర్తి చేశాడు. లక్నో బౌలర్లలో ఎం. సిద్ధార్థ్ నాలుగు ఓవర్లలో 47 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. మోసిన్ ఖాన్ ఒక వికెట్, మహ్మద్ షమీ ఒక వికెట్ పడగొట్టినా ఏమాత్రం లాభం లేకపోయింది. భారీ స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్ లో సొంత గడ్డపై ముంబై బ్యాటర్ల ఆధిపత్యమే కొనసాగింది.

### తేలిపోయిన లక్నో బౌలర్లు..

ఈ అద్భుత విజయంతో ముంబై ఇండియన్స్ సొంత అభిమానుల ముందు గర్వంగా తలెత్తుకుంది. బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నా.. బ్యాటర్లు సమష్టిగా రాణించి అసాధ్యం అనుకున్న లక్ష్యాన్ని సుసాధ్యం చేశారు. లక్నో బౌలర్లు ఏ దశలోనూ ముంబై బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో లక్నో బౌలింగ్ పూర్తిగా తేలిపోయింది. కచ్చితత్వంతో కూడిన బౌలింగ్ వేయడంలో లక్నో పేసర్లు, స్పిన్నర్లు దారుణంగా విఫలమయ్యారు. దీనిని ముంబై బ్యాటర్లు పూర్తిగా సద్వినియోగం చేసుకుని తమ జట్టుకు అద్భుతమైన విజయాన్ని అందించారు.



## హార్దిక్‌పై ఘాటు విమర్శలు

**కెప్టెన్సీ మార్పు కోరిన శ్రీకాంత్**

**ముంబై, మే 4 :** ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ వరుస పరాజయాలపై మాజీ భారత ఓపెనర్ శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జట్టు దుస్థితికి కెప్టెన్ హార్దిక్ తీసుకుంటున్న నిర్ణయాలే ప్రధాన కారణమని ఆయన విమర్శించారు. 9 మ్యాచ్‌ల్లో కేవలం 2 విజయాలతో పాయింట్ల పట్టికలో దిగువ స్థానంలో కొనసాగుతున్న ముంబై పరిస్థితిపై ఆయన ఘాటుగా స్పందించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ హార్దిక్‌ను 'ప్లాస్టిక్ కెప్టెన్' అంటూ విమర్శించారు. మ్యాచ్ పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకోకుండా తీసుకుంటున్న నిర్ణయాలు జట్టుకు నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. కెప్టెన్సీ ఒత్తిడి కారణంగా హార్దిక్ తన ఆల్‌రౌండర్ ప్రతిభను కూడా పూర్తిగా ప్రదర్శించలేకపోతున్నాడని విశ్లేషించారు. ఇప్పటికైనా ముంబై యాజమాన్యం నిర్ణయం తీసుకోవాలని సూచించిన ఆయన, కెప్టెన్సీ బాధ్యతలను తిరిగి రోహిత్ కు అప్పగించాలని అభిప్రాయపడ్డారు. రోహిత్ నాయకత్వంలోనే జట్టు మళ్లీ గెలుపు బాట పడే అవకాశముందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తుండగా, ముంబై ఇండియన్స్ తదుపరి నిర్ణయం ఎలా ఉంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.



## టాప్ నాలుగు కోసం ఉత్కంఠ

**హైదరాబాద్, మే 4 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. పాయింట్ల పట్టికలో జట్ల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఒక్క మ్యాచ్ ఫలితంతోనే స్థానాలు మారుతున్నాయి. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, తాజా ఓటమితో ఆధిక్యం తగ్గింది. వెంటనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు దగ్గర గా ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్ పాయింట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ రన్‌రేట్ కారణం గా తొలి నాలుగులో లేకపోవడం ఆసక్తికరం. ఇక ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు వరుస విజయాలతో పోటీలో నిలిచాయి. దీంతో ఈసారి తొలి నాలుగు స్థానాల కోసం ఏడు నుంచి ఎనిమిది జట్లు పోటీ పడుతున్నా యి. ఈ సీజన్‌లో బ్యాటర్లు ఆధిపత్యం చాటుతున్నారు. అభిషేక్ శర్మ, కెఎల్ రాహుల్ పరుగుల వరద పారిస్తున్నారు. రెండు వందలకుపైగా జట్టు స్కోర్లు తరచూ నమోదవుతున్నాయి. మరోవైపు భువనేశ్వర్ కుమార్, కాగిసో రబడా వంటి బౌలర్లు వికెట్ల వేటలో ముందున్నారు. ప్రస్తుత ప్రదర్శనను బట్టి పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తొలి నాలుగులో నిలిచే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. అయితే చివరి వరకు పోటీ ఉత్కంఠగా కొనసాగడం ఖాయం.

## సచిన్ ఇంట్లో సందడి

**ముంబై, మే 4 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా నేడు వాంఖడే మైదానంలో జరగబోయే ముంబై ఇండియన్స్-లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌కు ముందు ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నివాసంలో లక్నో జట్టు ఆటగాళ్లు విందులో పాల్గొనడం చర్చనీయాంశమైంది. లక్నో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న అర్జున్ టెండూల్కర్ తన సహచర ఆటగాళ్లను ఇంటికి ఆహ్వానించడంతో ఈ సమావేశం జరిగింది. సచిన్‌తో కలిసి గడిపిన క్షణాలను ఆటగాళ్లు ఎంతో ఆస్వాదించారు. ఈ విందుకు జట్టు కెప్టెన్ రిషబ్ పంత్‌తో పాటు మహ్మద్ షమీ, మొహ్సిన్ ఖాన్, ఆవేశ్ ఖాన్, అబ్దుల్ సమద్ తదితరులు హాజరయ్యారు. సచిన్‌తో మాట్లాడటం తమకు గొప్ప అనుభవమని వారు తెలిపారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్‌కు ఈ పోరు కీలకం. గెలిస్తేనే పోటీలో నిలిచే అవకాశం ఉండగా, ఓడిపోతే ఈ సీజన్ నుంచి తొలుత నిష్క్రమించే జట్టుగా మారే పరిస్థితి ఉంది.





## పంజాబ్ ఓటమి.. జట్టు పట్టుదలపై అయ్యర్ ప్రశంస

**అహ్మదాబాద్, మే 4 :** ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ జట్టు మరోసారి ఓటమిని చవిచూసినా, ఆటగాళ్ల పట్టుదలపై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసలు కురిపించారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన అయ్యర్, పిచ్ స్వభావం బ్యాటింగ్‌కు సవాల్‌గా మారిందని చెప్పారు. బౌన్స్ స్థిరంగా లేకపోవడం వల్ల షాట్లు ఆడటం కష్టమైందని పేర్కొన్నారు. ముఖ్యంగా పవర్ ప్లేలోనే కీలకమైన నాలుగు వికెట్లు కోల్పోవడం జట్టుపై ఒత్తిడిని పెంచిందన్నారు. అయితే ప్రారంభంలోనే ఇబ్బందులు ఎదురైనప్పటికీ, మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకున్నారని ఆయన కొనియాడారు. 160 పరుగుల మార్కును దాటడం పెద్ద విజయమని అభిప్రాయపడ్డారు. చివరి ఓవర్ వరకు మ్యాచ్‌ను తీసుకెళ్లడం బౌలర్ల పోరాటపటిమకు నిదర్శనమని చెప్పారు. వరుస ఓటములతో పాయింట్ల పట్టికలో వెనుకబడిన పంజాబ్ కింగ్స్, అయినప్పటికీ జట్టులో ఉన్న పోరాట స్ఫూర్తి భవిష్యత్ మ్యాచ్‌లలో గెలుపుకు దారి తీస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు గుజరాత్ టైటాన్స్ సమష్టిగా రాణించి కీలక విజయాన్ని నమోదు చేసింది.


## ధోనీ ఎంట్రీపై అనిశ్చితి



**చెన్నై, మే 4 :** ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఇంకా మైదానంలోకి దిగకపోవడం అభిమానులను నిరాశకు గురి చేస్తోంది. లీగ్ దశ ముగింపు దశకు చేరుకున్నా, ఈ స్టార్ ఆటగాడి ఎంట్రీపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశమైంది. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీ ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. జట్టుతో కలిసి కొన్ని మ్యాచ్‌లకు వచ్చినప్పటికీ తుది జట్టులో చోటు దక్కకపోవడం అభిమానుల్లో సందేహాలు రేకెత్తిస్తోంది. గాయమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇటీవల కాలి పిక్క గాయం కారణంగా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించలేకపోయిన ధోనీ ప్రస్తుతం పునరావాస దశలో ఉన్నాడు. వయసు కూడా ఒక అంశంగా మారడంతో మైదానంలోకి తిరిగి రావడానికి మరింత సమయం పట్టే అవకాశముంది. ఇటీవల ముంబైతో మ్యాచ్‌కు ముందు రోహిత్ శర్మను కలిసినప్పటికీ, మ్యాచ్‌లో మాత్రం కనిపించలేదు. మరోవైపు జట్టు ఢిల్లీ మ్యాచ్ కోసం వెళ్లగా ధోనీ చెన్నైలోనే ఉండిపోవడం అతని రీ-ఎంట్రీపై అనుమానాలను పెంచుతోంది. ధోనీ గైర్హాజరీలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ జట్టును ముందుండి నడిపిస్తూ క్రమంగా ఫామ్ అందుకుంటున్నాడు. ఇతర యువ ఆటగాళ్లు కూడా రాణించడంతో జట్టు ప్లే ఆఫ్స్ రేసులో కొనసాగుతోంది. మొత్తానికి, ఎంఎస్ ధోనీ ఎంట్రీపై స్పష్టత రాకపోయినా, సీజన్ చివరి దశలో అయినా మైదానంలోకి దిగుతాడనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## ఆర్సీబీకి షాక్.. సాల్ట్ స్వదేశానికి..

**బెంగళూరు, మే 4 :** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కీలక ఓపెనర్ ఫిల్ సాల్ట్ గాయం కారణంగా స్వదేశానికి వెళ్లడం పెద్ద ఎదురుదెబ్బగా మారింది. వేలి గాయంతో బాధపడుతున్న ఈ దూకుడు బ్యాటర్ మెరుగైన చికిత్స కోసం ఇంగ్లండ్‌కు పయనమయ్యాడు. గత మూడు మ్యాచ్‌లకు దూరమైన సాల్ట్, ఢిల్లీతో జరిగిన మ్యాచ్ తర్వాత మైదానంలో కనిపించలేదు. స్కానింగ్ పరీక్షల అనంతరం పరిస్థితి బట్టి తిరిగి జట్టులో చేరే అవకాశమున్నప్పటికీ, ప్రస్తుతం అతని రీ-ఎంట్రీపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో ఓపెనింగ్ జోడీగా యువ ఆటగాడు జాకబ్ బెథెల్కు అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాల్ట్ లేని లోటును భర్తీ చేయడం జట్టుకు సవాల్‌గా మారనుంది. ఈ సీజన్‌లో సాల్ట్ అద్భుత ఫామ్‌లో ఉండి కేవలం ఆరు ఇన్నింగ్స్‌ల్లోనే వేగవంతమైన రన్స్ సాధించి జట్టుకు శుభారంభాలు అందించాడు. అతని గైర్హాజరీతో ఆర్సీబీ టాప్ ఆర్డర్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో మంచి స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, తదుపరి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో కొత్త ఓపెనింగ్ కాంబినేషన్ ఎలా పనిచేస్తుందో అన్నది ఆసక్తికరంగా మారింది.



# విశ్వంభరలో త్రిష లుక్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లు_గా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్టాం÷-రగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవి-త్రిష కాంబినేషన్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన హైలైట్. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో వారి పాత్రలు ఎలా మలచబడ్డాయో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రానికి దర్శకుడు వశిష్ట విజువల్ ట్రీట్ ఇవ్వడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి వీఎఫ్ఎక్స్ స్టూడియోలు ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాయని సమాచారం. దీంతో 'విశ్వంభర' విజువల్‌గా కూడా అద్భుతంగా ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా కొనసాగుతోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ బ్డజెట్ చిత్రం టాలీవుడ్‌లో నెవర్ బిఫోర్ అనిపించే స్థాయిలో ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో రూపొందుతోంది. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశముంది.






# ఆదిత్యరాయ్‌తో సుతారియా డేటింగ్

బాలీవుడ్ లో ఇప్పుడు సినిమాల కంటే స్టార్ల వ్యక్తిగత జీవితాల చుట్టూనే ఎక్కువగా వార్తలు నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా హీరోహీరోయిన్ల డేటింగ్‌కు సంబంధించి, ఏ చిన్న టాపిక్ వచ్చినా.. అది సెన్సేషన్‌గా మారుతోంది. గతంలో ఇలాంటి డేటింగ్ వ్యవహారాల అనంతరం సెలబ్రిటీలు కొందరు మ్యారేజ్ చేసుకున్న వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఇలాంటి విషయాలు కామన్‌గా మారిపోరాయి. ఇప్పుడీ కామన్ పాయింట్‌లోకి మరో కొత్త జంట వచ్చి చేరారు. 'ఆషికీ2', 'ఓకే జాను' చిత్రాల ఫేమ్ ఆదిత్య రాయ్ కపూర్.. 'తడప్', 'హీరోపంతి 2' ఫేమ్ తారా సుతారియా డేటింగ్‌లో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియా సర్కిల్స్‌లో వార్తలు సెన్సేషన్‌గా మారాయి. బాలీవుడ్‌లోని ప్రధాన మీడియా సంస్థలు వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని అధికారికంగా ధృవీకరించడంతో.. సోషల్ మీడియాలో వారిద్దరి గురించే డిస్కషన్ నడుస్తోంది. ఇటీవల జరిగిన పలు సినీ వేడుకలు, ప్రైవేట్ పార్టీల్లో వీరిద్దరూ జంటగా కనిపించడంతో అభిమానులకు ముందే అనుమానం వచ్చింది. కొన్నిరోజులుగా వీరి రిలేషన్‌పై వార్తలైతే వినిపిస్తున్నాయి కానీ, అధికారికంగా ఎక్కడా రివీల్ కాలేదు. ఇప్పుడు ప్రధాన మీడియా సంస్థలే కన్ఫర్మ్ చేయడంతో.. ఇద్దరి మధ్య రిలేషన్ నిజమే అనేలా ఫ్యాన్స్ కూడా ఫిక్స్ అవుతున్నారు. ఇద్దరు నటులు తమ వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచినప్పటికీ, వరుసగా జంటగా కనిపిస్తుండటం మాత్రం వారి మధ్య ఏదో ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. 2026 ప్రారంభంలో ముంబైలో తారా సుతారియా తన కొత్త ఇంటికి మారిన సమయంలోనూ ఈ జోడీ సందడి చేయడం విశేషం. సోషల్ మీడియాలో నెటిజన్లు వీరిని 'పవర్ కపుల్' అంటుంటే.. వీరి క్లాసిక్, సైలెంట్ పర్సనాలిటీలు ఒకరికొకరు పర్ఫెక్ట్‌గా సెట్ అవుతాయని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ చేతినిండా అవకాశాలతో బిజీ బిజీగా ఉన్నారు. యష్ 'టాక్సిక్'లో తారా సుతారియా ఓ కీలక పాత్రను పోషిస్తోన్న విషయం తెలిసిందే. ఆదిత్య రాయ్ కపూర్ విషయానికి వస్తే.. ఇంతకు ముందు అనన్యా పాండేతో పాటు పలువురితో ప్రేమాయణం నడపగా, తారా సుతారియా కూడా వీర్‌తో కొన్నాళ్లపాటు డేటింగ్‌లో ఉన్నట్లుగా టాక్ నడిచిన విషయం తెలిసిందే.






# కల్కి-2 షూటింగ్‌లో ప్రభాస్ చేరిక

ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 -2' ప్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్-నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిన్గి ÷నైల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.



# 'జై హనుమాన్'లో అక్షయ్ ఖన్నా?

తనదైన విజువల్స్, కథా బలంతో ఇండియన్ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ వర్మ, ఇప్పుడు తన 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్'ను హాలీవుడ్ రేంజ్‌లో విస్తరిస్తున్నారు. 'హనుమాన్' ఘనవిజయం తర్వాత ఆయన దర్శకత్వంలో రాబోతున్న 'జై హనుమాన్' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో బాలీవుడ్ విలక్షణ నటుడు అక్షయ్ ఖన్నా ఒక కీలక పాత్ర పోషించబోతున్నట్లు ఫిలిం నగర్ సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లోని 'మహాకాళి' చిత్రంలో అక్షయ్ ఖన్నా 'శుక్రాచార్యుడు' గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే పాత్ర 'జై హనుమాన్'లోనూ కనిపిస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. పాత్రకున్న వెయిటేజ్, ప్రాముఖ్యత దృష్ట్యా ప్రశాంత్ వర్మ ఆయనను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. 'జై హనుమాన్' లో కన్నడ స్టార్, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. రిషబ్ శెట్టి వంటి పవర్‌ఫుల్ పర్ఫార్మర్‌కు అక్షయ్ ఖన్నా తోడవ్వడం ఈ సినిమాకు పెద్ద అసెట్ కానుంది. ప్రశాంత్ వర్మ విజన్ ప్రకారం, ఈ యూనివర్స్‌లో ప్రతి పాత్రకు ఒక విశిష్టత ఉంటుందని, అక్షయ్ ఖన్నా పాత్ర కూడా కథను మలుపు తిప్పే విధంగా ఉంటుందని టాక్. కేవలం బాలీవుడ్ మార్కెట్ కోసమే కాకుండా, కథలో ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యత వల్లే అక్షయ్ ఖన్నాను తీసుకున్నట్లు సమాచారం. ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను పాన్-ఇండియా లెవల్‌లో అత్యంత పకడ్బందీగా నిర్మిస్తున్నారు. అక్షయ్ ఖన్నా పాత్రపై త్వరలోనే చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, 'జై హనుమాన్' లో ఈ క్రేజీ కాస్టింగ్ అప్‌డేట్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకువెళ్లింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**



## ప్రతినాయక పాత్రలకు భూషణం

# రక్తకన్నీరు నాగభూషణం

### రంగస్థలం, వెండితెరపై తనదైన ముద్ర..

### విలనిజంలో నూతన ఒరవడికి శ్రీకారం

సినిమాల్లోనూ, రంగస్థలం మీదా ఏకకాలంలో 'బిజీస్టార్'గా వెలిగిన ఏకైక నటుడు నాగభూషణం. నటనకే అంకితమైన ఆయన, సినీ పరిశ్రమలో స్థిరపడకముందే ఒకే నెలలో ముప్పయ్ ప్రదర్శనలు ఇచ్చి రికార్డు సృష్టించారు. పాతిక ఏళ్ల పాటు తన నాటక బృందంలోని సుమారు మూడు వందల మంది కళాకారులకు అన్నం పెట్టిన మానవతావాది ఆయన. వాణీశ్రీ, శారద వంటి ప్రముఖ నటీమణులు కూడా ఆయన బృంద సభ్యులుగా గుర్తింపు పొందారు.

**'రక్తకన్నీరు'తో ఇంటి పేరుగా మార్పు:**

నాగభూషణం అంటే అందరికీ గుర్తొచ్చేది 'రక్తకన్నీరు' నాటకం. ఎమ్మార్ రాధా తమిళంలో ప్రదర్శించిన ఈ నాటకాన్ని తెలుగులో వేలాది ప్రదర్శనలు ఇచ్చి, ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. సుమారు 5,500 ప్రదర్శనలు పూర్తి చేసుకున్న ఈ నాటకం వల్ల ఆయన పేరు 'రక్తకన్నీరు నాగభూషణం'గా మారిపోయింది. రవి ఆర్ట్స్ థియేటర్ పేరుతో ఆయన అనేక నాటకాలను ప్రదర్శించి, సుమారు 30 కుటుంబాలకు ఉపాధి కల్పించారు.

**సినీ ప్రస్థానం - విలక్షణ శైలి:**


1952లో 'పల్లెటూరు' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన నాగభూషణం, తొంభయ్యవ దశకం వరకు సుమారు రెండు దశాబ్దాల పాటు ఉజ్వలంగా ప్రకాశించారు. 'ఏది నిజం' చిత్రంతో కథానాయకుడిగా నటించి రాష్ట్రపతి అవార్డు అందుకున్నప్పటికీ, 'మంచి మనసులు' చిత్రంతో ఆయనకు గొప్ప గుర్తింపు లభించింది. విలనిజంలో 'కన్నింగ్' మరియు 'కామెడీ'ని మేళవించి ఆయన సృష్టించిన ఒరవడిని తర్వాత కాలంలో రావు గోపాలరావు, నూతన్ ప్రసాద్, కోట శ్రీనివాసరావు వంటి వారు కొనసాగించారు.

**కీలక పాత్రలు - ప్రముఖుల ప్రశంసలు**

పౌరాణిక చిత్రాల్లో శివుడు (భూకైలాస్), శకుని (కురుక్షేత్రం) వంటి పాత్రలతో మెప్పించిన ఆయన, ఎన్టీఆర్ కు అత్యంత ఆత్మీయులు. ఉమ్మడి కుటుంబం, వరకట్నం, కోడలు దిద్దిన కాపురం వంటి చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు విశేష ఆదరణ పొందాయి. 'బ్రహ్మచారి' సినిమాలో సూర్యకాంతం జంటగా ఆయన వేసిన ముసలి వేషం ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. కేవలం విలన్ పాత్రలే కాకుండా, ఆడపిల్లల తండ్రిగా కరుణ రసాత్మక పాత్రల్లో కూడా ఆయన జీవించారు.

**కళాకారుల సంక్షేమం కోసం కృషి:**

నటుడిగానే కాకుండా సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిగా నాగభూషణం పేరు పొందారు. సినీ కళాకారుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సాంగ్స్ అండ్ డ్రామా కమిటీలో సలహా సంఘ సభ్యునిగా కూడా సేవలందించి సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏప్రిల్ 19, 1921న జన్మించిన నాగభూషణం, మే 5, 1995న కన్నుమూశారు. ఆయన భౌతికంగా దూరమైనా, తెలుగు నాటక, సినీ రంగాల్లో ఆయన వేసిన ముద్ర చిరస్థాయిగా నిలిచిపోతుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అంగారక సంకట హర చతుర్థి

కృష్ణ పక్ష చతుర్థిని సంకష్ట హర చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి మంగళవారం నాడు వస్తే అంగారక సంకష్ట చతుర్థి అంటారు. వినాయకుని ఆరాధకులు సంకట వినాయక వ్రతం అనేది అత్యంత ప్రాముఖ్యమైన వ్రతంగా భావిస్తారు. ఆ రోజు అంతా ఉపవాసం వుండి సంకట గణేష పూజ సాయంకాలం జరిపి, చంద్రదర్శనం అయినాక వారి ఉపవాసంకు ముగింపు పలికి ఏదన్నా తింటారు. సంకట చతుర్థి ప్రాముఖ్యత భవిష్య పురాణంలోనూ నరసింహ పురాణంలోనూ చెప్పబడింది. సంకట చతుర్థి మహత్యం శ్రీ కృష్ణుడు యుధిష్టరునికి వివరించాడు. సంకట అంటే కష్టములు, ఇబ్బందులు, సమస్యలను హర అంటే హరించేది అని అర్థం. ఋగ్వేదంలో గణపతి వేదాలు, జ్ఞానములకు, కర్మిష్టులకు, సర్వవ్యాపక భక్తుల ప్రభువని సర్వగణాలకు అధిదేవతని, సర్వా హ్లాదకరుడని, సర్వులకు జ్యేష్టుడని, అధినాయ కుడని, ఉత్తమ కీర్తి సంపన్నుడని కీర్తించబడ్డాడు. గణపత్యథర్వ శీర్షోపనిషత్తులో గణపతి సర్వవ్యాప్తమైన పరబ్రహ్మ స్వరూపమని సృష్టి స్థితి లయములకు కారకుడని, సర్వ కార్యము లకు సృష్టికి కర్త హర్త అని ఆనందమయుడని చిమ్మయుడని, లంబోదరుడని, శూర్పకర్ణుడు రక్తంగుడిగా అభివర్ణించారు. అటువంటి గణపతి సంకటాలను దూరం చేసేవాడని సంకట హరుడుగా పూజించడం అనాదిగా వస్తున్నదే. సంకటహరుని పూజించడానికి కృష్ణ పక్ష చతుర్థి ప్రసిద్ధి. సంకట హర చతుర్థి గురించి శ్రీకృష్ణుడు, ధర్మ రాజుకు వివరించినట్లు పురాణ కథనం. భవిష్య, నరసింహ పురాణాల ప్రకారం, ఒక సారి ఇంద్రుడు, గణేశ ఉపాసకుడైన భృషుండి అనే మహాముని ఆశ్రమం నుండి, విమానంపై ఇంద్ర లోకానికి తిరిగి వెళుతూ, శూరసేన మహారాజు రాజ్యం మీదుగా వెళ్ళే సమయాన మహా పాపాత్ముడొకడు, విమానాన్ని చూసినంతనే విమానం నేలపై దిగి పోతుంది. తేజో విరాజితమైన విమానాన్ని శూరసేనుడు చూడబోయి, ఇంద్రుడిదని తెలుసుకుని, ఆగి పోవడానికి కారణమడిగి ఇంద్రుని ద్వారా విని, మళ్ళీ లేచే ఉపాయం ఏదని అడుగుతాడు.



ఆనాడు బహుళ పంచమి ఐనందున, గత దినం చతుర్థినాడు ఉపవసించిన భక్తులు ఉపవాస ఫలాన్ని దారబోస్తేనే, విమానం మళ్ళీ లేవగలదని ఇంద్రుడు వివరిస్తాడు. శూరసేనుని ఆజ్ఞాను వర్తులైన సైనికులు రాజ్యమంతా వడబోసినా అట్టి భక్తులు దొరకనిస్థితిలో నిరాశకు లోనుకాగా, ఆసమయం లోనే మృతి చెందిన ఒక స్త్రీని గణపతి దూత తీసుకెళుతుండడం చూసి ఇదేమిటని సైనికులు అడుగుతారు. ఆమె గతదినం నిద్రలో ఉపవాసంతో ఉండి, రాత్రి చాలాసేపైనాక మెలకువ వచ్చి భోజనం చేసిందని, తెల్లవారి మృతి చెందినదని, అలాగే జీవితంలో ఒకసారైనా సంకటహర చతుర్థి ఆచరిస్తే గణపతి లోక ప్రాప్తి లభించగలదని చెప్పారు. ఆమె శరీరాన్ని తమకు ఇవ్వాలని సైనికులు కోరగా, గణపతి దూత నిరాకరిస్తాడు. అదే సమయంలో ఆమె శరీరం నుండి వీచిన పెనుగాలి ఇంద్రుని విమానాన్ని స్పృశించిన వెంటనే అది పైకి లేస్తుంది.

సంకట హర చతుర్థి ప్రత్యేకత ...కృష్ణ పక్ష చతుర్థి సంకష్టహర, సంకటహర చతుర్థి అంటారు. ఈరోజు దినమంతా ఉపవాస ముండి, సాయంత్రం, నిశి పూజ, చంద్రదర్శనానంతరం భోజనాలు చేయడం, నిర్దేశిత ఆచారం. ఇలా చేస్తే సకల కష్టాలు, సంకటాలు తొలగి పోయి, సంకట నాశకుడైన విఘ్న నాయకుని కృపకు పాత్రులు, జన్మరాహిత్యం . మోక్షం సిద్ధించి, సప్త జన్మలు అవసరం లేకనే శాశ్వత గణేశ ప్రాప్తి కలుగనున్నట్లు పురాణాలు వివరిస్తున్నాయి. తలపెట్టిన పనులకు విఘ్నాలు కలుగుతూ అశాంతి, మానసిక, శారీరిక రుగ్మతలు, రుణ బాధలు, అనేక కష్టాలు కలుగుతున్నప్పుడు దుష్టగ్రహ పీడన నివారణ కొరకై ప్రతి నెలా సంకష్టహర చవితి నాడు యథాశక్తి విఘ్నేశ్వరుని పూజలు జరపడం సంప్రదాయం. కృష్ణపక్ష చవితి తిథి మంగళవారం తో కూడి వస్తే అంగారక చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి నాడు కలశ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహా గణపతి అధర్వ శీర్ష పూజలు, అభిషేకం, అష్టోత్తర అర్చనలు, నివేదన, హారతి, మంత్రపుష్పం, నీరాజన, తీర్థ ప్రసాద వితరణాది సాంప్రదాయక క్రతువులను నిర్వహించడం, భక్తుల గోత్రనామాదులతో ప్రత్యేక అర్చనలు, గణపతి ఉపనిషత్ యుక్త అభిషేకాదులను నిర్వహించు కోవడం, భక్తులు తమ స్వగృహాలలోనూ గణపతి పూజ లొనరించి రాత్రి చంద్ర దర్శనానంతరం అరగించడం సనాతన సంప్రదాయం. వినాయకుని అనుగ్రహ ప్రాప్తికై, కుజుడు చేసిన తపస్సు ఫలితంగా, మాఘ కృష్ణ చతుర్థి దినాన చంద్రోదయ వేళలో పది భుజాలు కలిగిన బాలుని రూపంలో ప్రత్యక్షమై ఆ నాడు మంగళవారం కనుక కుజుని పేరు మంగళుడని నామకరణం చేసి, అంగారక సంకష్ట చతుర్థి నాడు వినాయక వ్రతాచరణ ద్వారా కుజ దోష సమస్యలు తొలగి పోగలవని, సంకటాలన్ని తొలిగి సఫలత లభించగలదని వరం ప్రసాదించారని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# శుభ్రమైన హస్తం సురక్షితమైన లోకం

### నేడు 'ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం'



ప్రపంచ మానవాళిని ఆరోగ్య పథంలో నడిపించే అత్యంత సరళమైన, శక్తివంతమైన ఆయుధం 'చేతుల పరిశుభ్రత'. నిత్యం మనం చేసే పనులలో భాగంగా చేతులు అనేక ఉపరి తలాలను తాకుతుంటాయి, తద్వారా కంటికి కనిపించని కోట్లాది సూక్ష్మ జీవులకు అవి వాహకాలుగా మారుతాయి. ఈ నేపథ్యంలో, చేతుల శుభ్రత పట్ల ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా మే 5వ తేదీన 'ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం' (ఔశీతీశ్రీ౩ ఝఅ౩ ఎ౧-స్త్రఅవఅవ ఝ౧) నిర్వహించ బడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) సారథ్యంలో సాగే ఈ ఉద్యమం కేవలం ఒక రోజు కార్యక్రమం కాదు; ఇది ఒక జీవనశైలి మార్పుకు పిలుపు. ముఖ్యంగా వైద్య రంగంలో ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టడానికి మరియు సాధారణ ప్రజానీకంలో అంటువ్యాధుల ప్రభావాన్ని తగ్గించడానికి ఈ దినోత్సవం ప్రాముఖ్యత సంతరించుకుంది.

**చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతను గుర్తించిన తొలినాటి వ్యక్తులలో ఇగ్నాజ్ సెమ్మెల్వైస్ ప్రముఖులు. 1840వ దశకంలో వియన్నాలోని ఒక ఆసుపత్రిలో ప్రసవ సమయంలో తల్లుల మరణాల రేటు ఎక్కువగా ఉండడాన్ని గమనించిన ఆయన, వైద్యులు చేతులు కడుక్కోవడం ద్వారా ఆ మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని నిరూపించారు. ఆనాడు అది విమర్శలకు గురైనప్పటికీ, నేడు ఆధునిక వైద్య శాస్త్రానికి అదే పునాది అయ్యింది. 2009లో ప్రపంచ ఆరోగ్య సంస్థ 'సేవ్ లైవ్స్: క్లీన్ యువర్ హాండ్స్' (ఝఱజవ ాఱఙవం: జశ్రీఝఅ్ శిబతీ ఝఅ౧ం) అనే ప్రపంచ ప్రచారాన్ని ప్రారంభించి, మే 5ను అధికారికంగా చేతి పరిశుభ్రత దినోత్సవంగా ప్రకటించింది. ఐదవ నెలలోని ఐదవ రోజును ఎంచుకోవడానికి గల సంకేతం మన చేతికి ఉండే ఐదు వేళ్లు. ఈ ఐదు వేళ్లూ శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం మన హస్తగత మవుతుందన్నది దీని అంతరార్థం.**



చేతుల పరిశుభ్రత కేవలం నీళ్లతో తడుపు కోవడం కాదు; దానికొక శాస్త్రీయ పద్ధతి ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రకారం, చేతులను కనీసం 20 నుండి 40 సెకన్ల పాటు సబ్బుతో రుద్ది కడగాలి. అరచేతులు, వేళ్ల సందులు, గోళ్ల లోపలి భాగం, మణికట్టు వరకు ప్రతి అంగుళాన్ని శుభ్రం చేయాలి. ఒకవేళ సబ్బు అందుబాటులో లేకపోతే 60 శాతం ఆల్కహాల్ కలిగిన శానిటైజర్లను వినియోగించాలి. ముఖ్యంగా ఆహారం తీసుకునే ముందు, ఆహారం వండేటప్పుడు, మరుగుదొడ్లను ఉపయోగించిన తర్వాత, జంతువులను తాకినప్పుడు మరియు తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు చేతులను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి. ఆసుపత్రి వాతావరణం లోనైతే 'ఫైవ్ మూమెంట్స్' (ఖీఱఙవ వీశీ-ఎవ౯ం) అనే సూత్రాన్ని వైద్య సిబ్బంది పాటించాలి. రోగిని తాకక ముందు, వైద్య ప్రక్రియకు ముందు, శరీర ద్రవాల తాకిడి తర్వాత, రోగిని తాకిన తర్వాత మరియు రోగి పరిసరాలను తాకిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవడం వల్ల ఆసుపత్రి సంబంధిత ఇన్ఫెక్షన్లను అడ్డుకోవచ్చు.

గణాంకాల పరంగా చూస్తే, చేతుల పరిశుభ్రత యొక్క ప్రభావం ఆశ్చర్యకరంగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షలాది మంది కేవలం అపరిశుభ్రత వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ల కారణంగా మరణిస్తున్నారు. చేతులు సరిగ్గా కడుక్కోవడం వల్ల అతిసార వ్యాధుల (ణఱఖతీతీష్ట్రమ) ముప్పు 30 నుండి 40 శాతం తగ్గుతుందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు (=వంజూఱతీఫ్శీతీఎ ×అటవష-అశీఅం) 20 శాతం వరకు తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో శిశు మరణాల రేటును తగ్గించడంలో ఈ చిన్న అలవాటు కీలక పాత్ర పోషిస్తోంది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో, వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో మాస్క్ ధరించడంతో పాటు చేతుల పరిశుభ్రత ఎంతటి కీలక పాత్ర పోషించిందో మనందరం ప్రత్యక్షంగా చూశాం. ఇది కేవలం కోవిడ్‌కే కాదు, నిమోనియా, కలరా వంటి తీవ్రమైన వ్యాధులకు కూడా చెక్ పెడుతుంది.

అయితే, నేటికీ ప్రపంచ జనాభాలో గణనీయమైన శాతం మందికి సురక్షితమైన నీరు మరియు సబ్బు అందుబాటులో లేకపోవడం విచారకరం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక సదుపాయాల కొరత పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేసి, ప్రతి చోటా నీటి సదుపాయం కల్పించడంతో పాటు, ప్రజలలో ప్రవర్తనా మార్పును తీసుకు రావాలి. చిన్నతనం నుండే పిల్లలకు పాఠశాలల్లో చేతులు కడుక్కోవడం ఒక క్రతువులా అలవాటు చేయాలి. 'నేర్చుకున్న విద్య – అలవాటైన శుభ్రత' అనే చందంగా బాల్యంలో ఏర్పడిన ఈ అలవాటు వారిని జీవితాంతం ఆరోగ్యవంతులుగా ఉంచుతుంది.

**ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని నిజం చేయాలంటే మనం పాటించాల్సిన మొదటి నియమం చేతుల పరిశుభ్రత. ఇది ఖర్చు లేని, సులభమైన మరియు అత్యంత ప్రభావవంతమైన నివారణోపాయం. "మనం రక్షించే ప్రాణాలు మన చేతుల్లోనే ఉన్నాయి" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ స్మరించాలి. వైద్యులు, నర్సులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు – ఇలా సమాజంలోని ప్రతి వర్గం తమ వంతు బాధ్యతగా పరిశుభ్రత పట్ల చైతన్యాన్ని వ్యాప్తి చేయాలి. మే 5వ తేదీన జరుపుకునే ఈ ప్రపంచ చేతి పరిశుభ్రత దినోత్సవం కేవలం ఒక వేడుకగా మిగిలి పోకుండా, ప్రతి రోజూ ప్రతి నిమిషం మన చేతులను నిష్కల్మషంగా ఉంచుకుందామని ప్రతిజ్ఞ చేద్దాం. పరిశుభ్రమైన చేతులే సురక్షితమైన ప్రపంచానికి పునాదులు. వ్యాధుల రహిత సమాజాన్ని నిర్మించే క్రమంలో మనమందరం ఒకటై, శుభ్రతను ఒక సంస్కృతిగా మార్చుకుందాం. ఇదే మనం రేపటి తరానికి ఇచ్చే నిజమైన ఆరోగ్య కానుక.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఎన్నికల ఫలితాలతో మార్కెట్లు లాభాల్లో




**ముంబై, మే 4 :** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. అమెరికా--ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో పాటు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సూచీలకు ఊతమిచ్చాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ ఆధిక్యంలో ఉండటం పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచింది. సెన్సెక్స్ ప్రారంభంలోనే లాభాలతో మొదలై, రోజులో ఒక దశలో వెయ్యి పాయింట్లకు పైగా ఎగసింది. అనంతరం కొంత లాభాలు తగ్గినా, చివరికి 355.90 పాయింట్లు పెరిగి 77,269.40 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 121.75 పాయింట్లు పెరిగి 24,119.30 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.08 వద్ద చరిత్రలోనే కనిష్ఠ స్థాయికి చేరింది. ప్రధాన సూచీలో అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, రిలయన్స్, ఎల్అండ్‌టీ వంటి కంపెనీల షేర్లు లాభపడగా, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, ఐటీసీ, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 113 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సుకు 4545 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీలు రావడం మార్కెట్లకు అనుకూలంగా మారింది. స్థిరమైన ప్రభుత్వాల ఏర్పాటుతో ఆర్థిక విధానాల్లో స్పష్టత వస్తుందని భావించిన పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ముందుకు వచ్చారని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# గ్రామీణ ప్రాంతాలకు స్కోడా కార్లు




**న్యూఢిల్లీ, మే 4 :** భారత ఆటోమొబైల్ రంగంలో తన ఉనికిని మరింత విస్తరించేందుకు స్కోడా ఆటో ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాలకూ తమ వాహనాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సామాన్య సేవా కేంద్రాలు గ్రామీణ ఈ-స్టోర్తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో నాన్ మెట్రో మరియు అర్ధపట్టణ ప్రాంతాల్లో కూడా స్కోడా వాహనాల విక్రయాలను విస్తరించాలనేది సంస్థ లక్ష్యం. సాధారణంగా ప్రీమియం కార్లు నగరాలకే పరిమితం అనే అభిప్రాయాన్ని మార్చుతూ, గ్రామీణ వినియోగదారులకు కూడా తమ ఉత్పత్తులను చేరువ చేయనుంది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా స్కోడా సంస్థకు చెందిన కైలాక్, కుషాక్, స్లావియా వంటి మోడళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇది డిజిటల్ ఆధారిత విక్రయ విధానంలో భాగంగా చివరి దశ కనెక్టివిటీని బలోపేతం చేయనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా వినియోగదారులు డిజిటల్ మరియు ప్రత్యక్ష సేవల కలయికతో సులభంగా వాహనాలపై సమాచారం పొందడం, కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యమవుతుంది. స్థానిక వ్యాపారవేత్తల సహకారంతో కస్టమర్ సేవలను మెరుగుపరుస్తూనే, డెలివరీ మరియు సేవల కోసం ఇప్పటికే ఉన్న డీలర్‌షిప్ నెట్‌వర్క్‌ను వినియోగించుకోనున్నారు. ఈ సందర్భంగా సంస్థ బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ, విశ్వసనీయ స్థానిక నెట్‌వర్క్ ద్వారా అందుబాటులో ఉన్న లోటును పూరించడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సాంకేతికతను మరియు ప్రీమియం వాహనాలను సాధారణ ప్రజలకు చేరువ చేయడం ద్వారా సమగ్ర వృద్ధి సాధించాలనేది తమ లక్ష్యమని చెప్పారు. మొత్తానికి ఈ అడుగు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా అంతర్జాతీయ స్థాయి వాహనాలు అందుబాటులోకి రావడం, దేశీయ ఆటోమొబైల్ మార్కెట్ అభివృద్ధికి దోహదం చేయనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జియో చౌక ప్లాన్ రద్దు.. వినియోగదారులకు భారమా?




**న్యూఢిల్లీ, మే 4 :** దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో వినియోగదారులకు కీలక మార్పు చేసింది. తక్కువ ధరలో లభించే ప్రముఖ రీఛార్జ్ ప్లాన్‌లలో ఒకటైన రూ. 209 ప్లాన్‌ను పూర్తిగా తొలగించింది. గతంలో ఈ ప్లాన్‌ను ప్రధాన జాబితా నుంచి తీసివేసినా, మొబైల్ అనువర్తనం ద్వారా రీఛార్జ్ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ అవకాశం కూడా నిలిపివేయడంతో వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. ఈ రూ. 209 ప్లాన్ కింద 22 రోజుల వ్యాలిడిటీతో రోజుకు 1 గిగాబైట్ వేగవంతమైన డేటా, పరిమితిలేని కాలింగ్, రోజుకు 100 సందేశాల సౌకర్యం లభించేది. తక్కువ ధరలో అవసరమైన సేవలు అందించడంతో ఇది మధ్యతరగతి వినియోగదారులకు అనుకూలంగా ఉండేది. ఇప్పుడు ఈ ప్లాన్ లేకపోవడంతో వినియోగదారులు ఎక్కువ ధర గల ఇతర ప్లాన్‌లను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం ద్వారా టెలికాం సంస్థలు వినియోగదారుల సగటు ఆదాయాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. చౌకైన ప్లాన్‌లను క్రమంగా తగ్గిస్తూ, అధిక ధరల ప్లాన్‌లవైపు వినియోగదారులను మళ్లించే ప్రయత్నం జరుగుతోందని వారు చెబుతున్నారు. ఈ మార్పు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు మరియు తక్కువ ఆదాయం గల వర్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటి వరకు తక్కువ ఖర్చుతో మొబైల్ సేవలను వినియోగించిన వారు ఇకపై కనీసం ఇరవై నుంచి ముప్పై శాతం వరకు అదనపు వ్యయం చేయాల్సి వచ్చే పరిస్థితి ఉంది. మొత్తానికి, రిలయన్స్ జియో తీసుకున్న ఈ నిర్ణయం వినియోగదారుల ఖర్చులను పెంచే దిశగా మారిందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇతర టెలికాం సంస్థలు కూడా ఇదే విధానాన్ని అనుసరించే అవకాశముందనే ఆందోళన వినిపిస్తోంది.

# హోర్ముజ్ దాటిన భారత్ గ్యాస్ ట్యాంకర్ ప్రయాణం

**న్యూఢిల్లీ, మే 4**: భారతదేశానికి చెందిన ద్రవీకృత పెట్రోలియం వాయువు రవాణా నౌక సర్వ్ శక్తి కీలకమైన హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటి విశాఖపట్నం వైపు ప్రయాణిస్తోంది. పశ్చిమ ఆసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా విధించిన దిగ్బంధనం కారణంగా గత కొన్ని వారాలుగా ఈ ప్రాంతంలో నౌకా రవాణా తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో, ఈ ట్యాంకర్ ప్రయాణం అరుదైనదిగా భావిస్తున్నారు. మార్షల్ దీవుల జెండా కింద ప్రయాణిస్తున్న ఈ నౌక మే 2న హోర్ముజ్ జలసంధిని దాటింది. ఈ నౌకలో సుమారు 46,313 టన్నుల ఎల్‌పిజి ఉంది. 18 మంది భారతీయులతో సహా మొత్తం 20 మంది సిబ్బంది ఈ ట్యాంకర్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఇది ఒమన్ గల్ఫ్ ప్రాంతం దాటుతూ విశాఖపట్నం వైపు సాగుతోంది. మే 13న ఈ నౌక విశాఖపట్నం చేరుకునే అవకాశముందని సమాచారం. దేశానికి సుమారు అర రోజు అవసరానికి సరిపడే గ్యాస్‌ను ఈ నౌక మోసుకెళ్తోంది. పశ్చిమ ఆసియా సంఘర్షణల కారణంగా ఏర్పడిన సరఫరా కొరతను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ నౌకను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అద్దెకు తీసుకుంది. అమెరికా దిగ్బంధనం తర్వాత హోర్ముజ్ మార్గాన్ని దాటిన తొలి భారత ట్యాంకర్ ఇదే కావడం విశేషం. ఈ పరిణామం భారత్‌కు ఇంధన సరఫరా భద్రత విషయంలో ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.






## స్వల్పంగా తగ్గిన బంగారం

**హైదరాబాద్, మే 4 :** ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ పరిస్థితుల ప్రభావంతో హెచ్చుతగ్గులకు లోనవుతున్న బంగారం ధరలు సోమవారం స్వల్పంగా తగ్గాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ధరలు కాస్త తగ్గడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభిస్తోంది. ఈ రోజు ఉదయం పరిస్థితి ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు ఒక లక్ష యాభై వేల తొమ్మిది వందల ఇరవై రూపాయల వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర ఒక లక్ష ముప్పై ఎనిమిది వేల మూడు వందల నలభై రూపాయల వద్ద ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఒక లక్ష యాభై ఒక వేల రెండు వందల ఇరవై రూపాయలు కాగా, 22 క్యారెట్ల బంగారం ధర ఒక లక్ష ముప్పై ఎనిమిది వేల నాలుగు వందల తొంభై రూపాయల వద్ద నమోదైంది. వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి. కిలోకు సుమారు వంద రూపాయల మేర తగ్గుదల కనిపించింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రెండు లక్షల అరవై తొమ్మిది వేల తొమ్మిది వందల రూపాయల వద్ద ఉంది. ఢిల్లీలో కిలో వెండి ధర రెండు లక్షల అరవై నాలుగు వేల తొమ్మిది వందల రూపాయలు కాగా, చెన్నైలో రెండు లక్షల అరవై తొమ్మిది వేల తొమ్మిది వందల రూపాయలు, బెంగళూరులో రెండు లక్షల అరవై నాలుగు వేల తొమ్మిది వందల రూపాయలుగా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో బంగారం, వెండి ధరలు రాబోయే రోజుల్లో కూడా మార్పులకు లోనయ్యే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

## శాంసంగ్ కుటుంబం భారీ పన్ను చెల్లింపు పూర్తి



**సియోల్, మే 4 :** దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ సంస్థ శాంసంగ్ గ్రూప్ వారసులు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఒక భారీ మైలురాయిని పూర్తి చేశారు. సంస్థ మాజీ చైర్మన్ లీ కున్-హీ వదిలిన ఆస్తులపై విధించిన వారసత్వ పన్నును పూర్తిగా చెల్లించారు. సుమారు 12 ట్రిలియన్ వోన్‌లకు సమానమైన ఈ పన్నును ఐదేళ్ల కాలంలో ఆరు విడతలుగా చెల్లించారు. ఈ మొత్తం సుమారు ఎనిమిది బిలియన్ అమెరికా డాలర్లకు సమానం. ప్రపంచంలోనే అత్యధిక వారసత్వ పన్ను రేట్లు ఉన్న దేశాల్లో దక్షిణ కొరియా ఒకటి కావడంతో, ఈ చెల్లింపు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. లీ కున్-హీ తన వారసులకు సుమారు 26 ట్రిలియన్ వోన్‌ల విలువైన ఆస్తులను వదిలారు. ఇందులో షేర్లు, స్థిరాస్తులు, అరుదైన కళాఖండాలు ఉన్నాయి. ఈ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రస్తుత చైర్మన్ లీ జే-యోంగ్తో పాటు కుటుంబ సభ్యులు ఈ భారీ పన్నును ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఒకే కుటుంబం చెల్లించిన ఈ పన్ను మొత్తం దక్షిణ కొరియా ప్రభుత్వం ఒక ఏడాదికి అంచనా వేసిన వారసత్వ పన్ను ఆదాయాన్ని మించి ఉండటం విశేషం. ఇది శాంసంగ్ గ్రూప్ ఆ దేశ ఆర్థిక వ్యవస్థలో ఎంత కీలక పాత్ర పోషిస్తుందో స్పష్టంగా చూపిస్తోంది. ఎలక్ట్రానిక్స్ నుంచి నౌకా నిర్మాణం వరకు విస్తరించిన శాంసంగ్ వ్యాపార సామ్రాజ్యం, దేశ ఆర్థిక వృద్ధిలో ప్రధాన ఆధారంగా కొనసాగుతోంది. ఈ భారీ పన్ను చెల్లింపు ద్వారా సంస్థ కుటుంబం తమ బాధ్యతను నిర్వర్తించిందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

## యూపీఐ ఎక్కువైతే ఖర్చులు పెరుగుతాయా?

**న్యూఢిల్లీ, మే 4 :** దేశంలో యూపీఐ ద్వారా లావాదేవీలు వేగంగా పెరుగుతున్నాయి. క్షణాల్లో చెల్లింపులు చేసే సౌలభ్యం వల్ల ప్రతి చిన్న ఖర్చుకూ యూపీఐ వినియోగం సాధారణమైంది. అయితే ఇదే అలవాటు కొంతమందికి ఆర్థికంగా నష్టంగా మారే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్న మొత్తాల చెల్లింపులు పెద్దగా అనిపించకపోయినా, రోజువారీగా చేసినప్పుడు నెల చివరికి భారీ ఖర్చుగా మారుతాయి. రోజుకు టీ, స్నాక్స్, ఆన్‌లైన్ ఆర్డర్లు వంటి చిన్న చిన్న లావాదేవీలు కలిపితే వేల రూపాయలు ఖర్చవుతాయని చెబుతున్నారు. ఈ ఖర్చులు స్పష్టంగా గుర్తుకురాకపోవడం వల్ల బడ్జెట్‌పై ప్రభావం పడుతుంది. భౌతిక నగదు ఉపయోగించినప్పుడు డబ్బు ఖర్చు అవుతున్న భావన ప్రత్యక్షంగా కనిపిస్తుంది. దీంతో ఖర్చుపై నియంత్రణ ఉండే అవకాశం ఎక్కువ. కానీ డిజిటల్ చెల్లింపుల్లో ఆ భావన తగ్గిపోవడంతో అవసరం లేని ఖర్చులు పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఆఫర్లు, డిస్కౌంట్లు చూసి ఆవేశపూరితంగా కొనుగోళ్లు చేసే అవకాశమూ ఎక్కువగా ఉంటుంది. ఇంకా ఒక సమస్య ఏమిటంటే, వివిధ అనువర్తనాల ద్వారా చెల్లింపులు చేయడం వల్ల ఖర్చులను ట్రాక్ చేయడం కష్టమవుతుంది. అందువల్ల ప్రతి నెలా బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను పరిశీలించడం అవసరం. ఎక్కడ ఎక్కువ ఖర్చు చేస్తున్నామో తెలుసుకుని అవసరం లేని ఖర్చులను తగ్గించుకోవచ్చు. మొత్తానికి, యూపీఐ వినియోగం సౌకర్యవంతమైనదే అయినప్పటికీ, జాగ్రత్తలు పాటించకపోతే అనవసర ఖర్చులు పెరిగే ప్రమాదం ఉంది. క్రమం తప్పకుండా ఖర్చులను పరిశీలించడం, చిన్న లావాదేవీలపై కూడా అవగాహన కలిగి ఉండడం ద్వారా ఆర్థిక నియంత్రణ సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.